జన రాజకీయం కోసం... ₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 9 పక్షపత్రిక సంచిక - 11

జూన్ 1-15, 2018



## ఫెడరలిజం ఎజెండాతో... స్థానిక ప్రభుత్వాలకు మంచిరోజులు కనిపిస్తున్నాయి



## కులం కన్నా... మన ప్రయోజనాలు ముఖ్యం కావాలి!

## రాష్ట్రాల్లో సంస్కరణలే దేశానికి మార్గం



## రేప్‌లను ఆపేదెలా? ('రాచేపల్లి' పాఠం)


కొండ అయిన కరుగుతుంది కాని
మనం వాడే పాలిథిన్ కవర్ మాత్రం కరగదు
PLEASE JOIN IN
#TiffinBoxChallenge
BY DOSAPATI RAMU

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

జూన్ 1-15, 2018 | సంపుటి - ౨ | సంచిక - 11




పెట్రోలు ధరలు తగ్గించే చర్యలు చేపట్టే దాకా పెంచుతూ పోవచ్చన్నారు. ఇందాకే మాట్లాడాను సార్!

## కార్టూన్ కార్నర్

## లోపలి పేజీల్లో...

ఫెడరలిజం ఎజెండా అవుతుందటం వల్ల......... 5
రేప్‌లను ఆపేదెలా? ('దాచేపల్లి' పాఠం)........... 7
అత్యాచారాలపై ప్రభుత్వాలు, పెద్దల తీరుని....... 12
పై తరగతికి వెళ్లే కొద్దీ ప్రతిభ పతనం............... 13
లైసెన్స్ పర్మిట్ రాజ్ నుంచి 1991లో ........... 18
ఇంత తపన పడే తల్లిదండ్రులు చాలా దేశాల్లో.. 20
రైతు ఆదాయంపై లెక్కలు కరువు.................. 22
రైతులకు, వినియోగదారులకు నష్టం చేసే....... 24
ప్రతిభ ఉన్నది 80 మార్కులు తెచ్చుకున్న........... 25
హక్కుగా జరగాల్సిన పనులకు లంచం .......... 26
చారిత్రక విభాతసంధ్యల వైపు..................... 28
(మీడియాలో) 'కీ' కామెంట్లు ! ..................... 31
కులం కన్నా... మన ప్రయోజనాలు ముఖ్యం..... 33

### సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

### రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

### చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

### లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజీ | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |


♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# రాష్ట్రాల్లో సంస్కరణలే దేశానికి మార్గం



కర్ణాటక తాజా అసెంబ్లీ ఎన్నికల సమయంలో పత్రికల్లో, టీవీల్లో, సోషల్ మీడియాలో, నోటిమాటగానూ మన సమాజంలో జరిగిన చర్చ, విశ్లేషణలు అంతా ఇంతా కాదు. బోలెడంత సృజనాత్మకత వెల్లివిరిసింది. ఎప్పటికప్పుడు కొత్త విషయాలు తెలుసుకుంటూ.. చిన్న చిన్న వివరాలు కూడా పొల్లుపోకుండా కూడికలు, తీసివేతలు, అంచనాల్ని వేశారు. తమకొచ్చే ప్రయోజనం మీదకన్నా.. బీజేపీ మీదో, మరోపక్షం మీదో ఉన్న కోపంతోనో, తాత్కాలిక అవసరాలరీత్యానో మాత్రమే ఎక్కువమంది స్పందించారు. ముఖ్యంగా తెలుగువారు ఎంతో ఉత్కంఠతో ఊహాగానాలు చేశారు. ఇంతమంది ఇన్ని తెలివితేటల్ని, ఇంత సత్తువను, ఊహాశక్తిని గనక అధికారం పరమావధిని సాధించటానికి కావలసిన ఎజెండా, విధానాల మీద పెట్టి ఉంటే.. లబ్ధి ఎంత స్థాయిలో ఉండేది?! ఎజెండా లేని జెండాలు, తాయిలాల చుట్టూనే ఈ ఎన్నికలు ముగియటంతో.. కర్ణాటకలో ఎవరికి ఎక్కువ సీట్లు వచ్చినా, ఎవరు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా ప్రజలకు, ఈ దేశానికి అసలు ప్రయోజనాలు దక్కే అవకాశాలు తక్కువ. ఓ లాభసాటి వ్యాపారంలో పెట్టుబడి పెట్టే కంపెనీల్లా.. ప్రజల పేరు మీద వేల కోట్ల ఖర్చు, భారీ డేటా ప్రచారం చేస్తూ అధికారం కోసం పార్టీలు ఈ ఎన్నికల్లో వ్యూహాత్మక పోరును సృష్టించాయి. ఇలాంటి ఎన్నికల్లో, పార్టీల గెలుపోటముల గురించి మనం అంతగా చించుకోనక్కర్లేదు. పాలనను మెరుగుపరచుకోవడానికి, వచ్చే ఎన్నికల్లోనైనా రాజకీయ పరిస్థితిని కొంత చక్కదిద్దుకోవడానికి ఉన్న అవకాశాలను వెతుక్కోవడం మేలు. పేదరికం, అవిద్య పెద్దఎత్తున కొనసాగుతూ, ప్రభుత్వోద్యోగుల్లో జవాబుదారీతనంలేని దేశంలో జరిగిన ఎన్నికలివి. ఇలాంటి చోట, తమ రోజువారీ అవసరాల కోసం ఓటును తాకట్టుపెట్టుకుందామనుకునే వారే ఎక్కువ. వీరందరితో ఓటు బేరాలు చేయాలంటే.. పోలింగ్ బూత్ స్థాయి వరకూ భారీ యంత్రాంగం ఉండాలి. డబ్బు ప్రభావ ఎన్నికలకు పెట్టింది పేరయిన కర్ణాటకలో ఇంత యంత్రాంగాన్ని నిర్వహించాలంటే ఒక్కో పాప్యులర్ పార్టీ వేల కోట్ల రూపాయలను పారించాల్సి ఉంటుంది. దీనర్థం, తెలుపు, నలుపు తేడా లేదని! కాంగ్రెస్‌తో పోలిస్తే వ్యక్తిగత స్వార్థం తక్కువ కాబట్టి, అధికారంలో పైమెట్టులో ఉన్నాయి కాబట్టి.. బీజేపీ/ఆర్ఎస్ఎస్ చాలా శక్తిమంతంగా ఈ పని చేయగలిగాయి. బీజేపీ, కాంగ్రెస్, ఆ తర్వాతి స్థానంలో ఉన్న జేడీ(ఎస్).. మూడూ ట్రైబల్ రాజకీయంతో ^ులం, మతం పేరుతో కన్నడవాసుల్ని విభజించాయి. సాధారణంగా మూడో స్థానంలో ఉన్న పార్టీకి తక్కువ ఓట్లు పడే అవకాశమున్న మన ఎన్నికల వ్యవస్థలో కూడా జేడీ(ఎస్)కు గణనీయంగా సీట్లు రావటానికి కారణం దక్షిణ కర్ణాటక ప్రాంతంలో ఆ పార్టీకి బలమైన పునాదులుండటం. ఇన్ని చేశాక.. అంతిమంగా ప్రజల మనసుల్లో పైకి తేలిన అభిప్రాయాలు, తటస్థ ఓటర్ల మొగ్గు విజేతల్ని నిర్ణయించాయి. దీన్ని మనం ఓ పార్టీ విజయంగా, అభ్యర్థుల అదృష్టంగా లెక్కేస్తున్నాం. మన చర్చంతా.. ఈ కాస్త చట్రంలో ప్రజలు చూపే మొగ్గు గురించే తప్ప- అసలు తమ ఓటుకు-తాము కట్టే పన్నుల డబ్బుకు, తమ వనరులకవినియోగానికి మధ్య ఉన్న సంబంధం ప్రజలకు అర్థమై ఓటు వేయటం, పార్టీలు ప్రకటించిన ఎజెండాల వల్ల ప్రజల జీవితాల్లో మార్పు రావటం అన్న వాటి మీద కాదు! డబ్బు, కిరాయి కార్యకర్తల వినియోగం, ఇతర రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున వలంటీర్ల దిగుమతి వంటివి లేకుండా ఉంటే.. అసలు ఎక్కువశాతం ప్రజలను ఓట్లపరంగా ప్రభావితం చేయడమనే ప్రశ్నే లేదు. కాంగ్రెస్ పార్టీ దుష్పరిపాలన నష్టాన్ని చాలామేర అధిగమించగలిగినా.. ఆ పార్టీ ఓట్లు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించటంతో కాంగ్రెస్ కన్నా ఈ ఎన్నికల్లో బీజేపీ ఎక్కువ సీట్లను గెలుచుకుంది. 'కులం-మతం' రెండు వైపులా పదునున్న హిందూత్వను ఎదుర్కోవడానికి సిద్ధరామయ్య సామాజిక సమీకరణాల్ని మితిమీరి నమ్ముకున్నారు. ఆయన వంశపారంపర్య ధోరణులు, పొత్తులపై ఏకపక్ష వ్యవహారశైలి వైఫల్యాన్ని ఖరారు చేశాయి. ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య చాలామేర స్వేచ్ఛగానే పనిచేశారు. తనకున్న స్వతంత్రతను కర్ణాటకకు మరింత స్వయంప్రతిపత్తి కోసం వినియోగించి పాలనాపరంగా మార్పుల మీద దృష్టి పెట్టి ఉంటే, ఆయన పార్టీకి విజయావకాశాలు బాగా మెరుగై వుండేవి. ఎన్నికల సమయం వచ్చేసరికి కర్ణాటకకు ప్రత్యేక జెండా, హిందీపై పోరాటం వంటివి చేసినా.. వాటిని గిమ్మిక్కుల కిందే ప్రజలు భావించారు. కానీ 'మా జీవితాల పట్ల నిర్ణయాల్ని మేమే తీసుకోవాలి, ఢిల్లీ శాసించకూడదు' అని స్థానిక స్వయంపాలన పట్ల ప్రజల్లో ఎంత అనురక్తి ఉందంటే.. ఒకానొక దశలో సిద్ధరామయ్యను ఎదుర్కోవడానికి నరేంద్రమోదీలాంటి బలశాలి కూడా తడబడ్డారు. మోదీ వర్సెస్ సిద్ధరామయ్యగా ఉన్న పోరాటాన్ని.. మోదీ వర్సెస్ రాహుల్ పోరాటంగా మార్చటానికి మోదీ, ఆయన పార్టీ నేతలు నానాతంటాలు పడ్డారు. కర్ణాటకలో బీజేపీ సీట్లలో ఆధిక్యం సాధించినా, ఓట్లలో వెనకబడే ఉంది, మరింత స్వయంప్రతిపత్తి కావాలనే ఫెడరల్ భావన అలాగే ఉంది. కాంగ్రెస్ పార్టీ బలహీనపడటంతో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేయాలనుకుంటున్న ప్రాంతీయ పార్టీలకు అవకాశాలు ఇంకా పెరిగాయి. బీజేపీ రాజకీయంగా విస్తరిస్తూ దేశమంతా ఏకపార్టీ పాలన అందించాలని చూస్తున్నకొద్దీ.. ప్రాంతీయ ఆకాంక్షలు, స్వయంప్రతిపత్తి కోసం డిమాండ్లు పెరుగుతాయి. మూడో దశ ఫెడరలిజం చుట్టూ రాజకీయం.. భవిష్యత్తు పరిణామాలను గణనీయంగా ప్రభావితం చేస్తుంది. ఇది చాలా సానుకూల పరిణామం కూడా. ఇప్పుడు కర్ణాటకలో ముఖ్యమంత్రిగా ఎవరయినా కూడా (జయలలిత తర్వాత తమిళనాడులోలాగా) ఎమ్మెల్యేల దయాదాక్షిణ్యాల మీద మనుగడ సాగించాల్సి ఉంటుంది. కొనుగోళ్లు, ఫిరాయింపుల మధ్య దోపిడీని, లంచాల్ని, పోస్టింగుల పైరవీలను చూసీచూడనట్టు వదిలేయాల్సి ఉంటుంది. ఈ ఎన్నికల్లో ప్రధాని మోదీ పలు వక్రీకరణలతో స్థాయిలేని ప్రచారం చేయటం, రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాసైనా ప్రభుత్వ ఏర్పాటులో కాంగ్రెస్‌ను మించిపోయేలా బీజేపీ బరితెగించటం చూశాక.. ఉన్న వ్యవస్థలో ఎన్నికల రాజకీయం ఎంత పతనావస్థకు చేరిందో విస్పష్టమవుతుంది. ఎమ్మెల్యేల ద్వారా కాకుండా.. ముఖ్యమంత్రులను ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకునే పద్ధతిని ప్రవేశపెట్టడమే దీనికి చాలామేర పరిష్కారం. ఫెడరలిజం విస్తరణ, రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా ఎన్నికల పద్ధతి వల్ల పార్టీలకు కూడా చాలా లాభం జరుగుతుంది కాబట్టి.. పలువురు ముఖ్యమంత్రులు కూడా ప్రత్యక్ష ఎన్నిక పట్ల సానుకూలత వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్ కూడా ప్రాప్తకాలజ్ఞతను ప్రదర్శించి రాష్ట్రాల్లో ఈ సంస్కరణలకు మద్దతివ్వటం వారి రాజకీయ భవిష్యత్తుకే మేలు. పార్టీలు వాటంతటవి దేశం కోసం ఎలాగూ పనిచేయటం లేదు.. కనీసం ఓట్ల కోసమైనా ఈ మంచిపనులు చేస్తాయని ఆశపడదాం.





# ఫెడరలిజం ఎజెండా అవుతుండటం వల్ల.. స్థానిక ప్రభుత్వాలకు మంచిరోజులు కనిపిస్తున్నాయి

ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే భారత్‌లో కంటే నియంతృత్వ చైనా, మతమూఢత్వంలో కొట్టుమిట్టాడే పాకిస్తాన్‌లలోనే స్థానిక ప్రభుత్వాలకు ఎక్కువ సాధికారత ఉందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. స్థానిక ప్రభుత్వాలకు నిధులు అధికారాలు ఇవ్వాలని తనలాంటి వాళ్లు చేస్తున్న వాదన అమాయకమైనది కాదని, ప్రజాస్వామ్యాన్ని వికసింప జేసేది స్థానిక స్వయంపాలనేనని స్పష్టం చేశారు. దేశాభివృద్ధికి, సరైన నాయకత్వం ఎదగటానికి మూడో అంచెలోని స్థానిక ప్రభుత్వాలే మూలస్తంభాలన్నారు.

'ప్రజాస్వామ్యంలో స్థానిక స్వయంపాలన ప్రభుత్వాల పాత్ర'పై కాకినాడలో నిర్వహించిన వ్యవస్థాపక మండల ప్రజా పరిషత్ అధ్యక్షుల (1987-92) సదస్సులో జేపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు.

చంకనెక్కే అలవాటు చేసిన పిల్లలు కిందకు దిగి నడవటానికి ఇష్టపడ రన్నట్టు.. మనదేశంలో స్థానిక పాలన పట్ల చాలా విముఖత ఉందని జేపీ అన్నారు. అలగా జనానికి అధికారాలిస్తే బోలెడు అవినీతి జరుగుతుందన్న విమర్శలు చేస్తుంటారన్నారు. కానీ పిల్లలకు నడక రావాలంటే నడవటం అలవాటు చేస్తామా? లేక నిరంతరం ఎత్తుకునే తిప్పుతుంటామా? అని ప్రశ్నించారు. పడుతూ లేస్తున్నా.. పిల్లలు నడవటాన్ని మనం ప్రోత్సహిస్తుంటామని, అయితే ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా పర్యవేక్షిస్తుంటామని.. అదేరీతిలో స్థానిక ప్రభుత్వాలకు స్వేచ్ఛనిచ్చి అక్కడ తప్పులు, అవినీతి జరగకుండా పర్యవేక్షణను మాత్రమే పైనుండే ప్రభుత్వాలు చేస్తుండాలని అన్నారు. స్థానిక ప్రభుత్వాల్లో ఎలా ఎన్నికలు జరగాలో, పనులు ఎలా చేయాలో కూడా ఢిల్లీలో నిర్ణయించటం, మునిసిపాలిటీ ఎన్నికల్లో ప్రధానివంటి వారు ప్రచారం చేయటం మితిమీరిన అధికార కేంద్రీకరణకు నిదర్శనమన్నారు. దీనివల్ల స్థానిక ప్రభుత్వాలు నిర్వీర్యమై జనం జీవితానికి, ప్రజాస్వామిక పాలనకు మధ్య సంబంధం తెగిపోతోందన్నారు. స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాల కోసం సుదీర్ఘకాలం నుంచీ పోరాడు తున్నా.. పైస్థాయిలో (దురుద్దేశం లేకున్నా) కొందరు మూర్ఖత్వంతో చేసిన తప్పిదాల వల్ల విలువైన అవకాశాలు చేజారిపోయా యన్నారు. 73, 74 రాజ్యాంగ సవరణలు నిరుపయోగంగా తయారయ్యాయన్నారు. రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక ప్రభుత్వాలకు సాధికారత తెచ్చే

అవకాశాలు ఇప్పట్లో కనిపించటం లేదని.. అయితే దేశంలో మారుతున్న రాజకీయ సమీకరణలతో ఫెడరలిజం విస్తరణ కోసం మొదలైన పోరాటాల వల్ల 2019 ఎన్నికల అనంతరం స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, నిధులు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయన్నారు. ఇదే జరిగితే స్థానిక స్వయంపాలన పటిష్టమై ప్రజలకు రోజువారీ సేవలు మెరుగ్గా అందుబాటులోకి వస్తాయని, పాలనలో భాగస్వాములై నాయకులుగా ఎదిగే మంచిరోజులు మొదలవుతాయని అన్నారు. స్థానిక ప్రభుత్వాలకు ఎటువంటి అధికారాలూ లేకపోవటం వల్లే ఈవేళ యువత వాటిలో భాగస్వాముల య్యేందుకు విముఖత చూపుతున్నా రన్నారు. స్వాతంత్ర్య పోరాట కాలంలో, స్వతంత్రం వచ్చిన తొలినాళ్లలో కూడా స్థానిక ప్రభుత్వాలు నాయకత్వాన్ని పెంచటంలో కీలకపాత్ర పోషించాయని, నెహ్రూ, పటేల్, సుభాష్ బోస్, రాజాజీ వంటి అనేకమంది దిగ్గజ జాతీయ నాయకులు మునిసిపల్ ఛైర్మన్లుగా, మేయర్లుగా పనిచేసే ఎదిగారని గుర్తుచేశారు.

దాదాపు 49 దేశాలను తాము అధ్యయనం చేస్తే, మౌలిక రంగాలన్నిటి లోనూ మనదేశం చివరి నాలుగు స్థానాల్లో ఉందని జేపీ అన్నారు. అధికార వికేంద్రీకరణ ద్వారా అభివృద్ధి, సుపరి పాలన సాధ్యమవుతుందన్నారు. ప్రజాస్వామ్యం అంటే ఏమిటో సామాన్య ప్రజలకు స్థానిక స్వయంపాలన ద్వారా తప్ప అర్థమయ్యే అవకాశం లేదని, ఇలాంటప్పుడు.. భ్రష్టుపట్టిన రాజకీయాల పట్ల ఉన్నకొద్దీ వారిలో ఏవగింపు పెరిగి ప్రమాదకర పరిస్థితులు ఏర్పడతాయని అన్నారు. గ్రామపంచాయతీలు కొన్ని రాష్ట్రాల్లో మెరుగ్గా ఉన్నప్పటికీ పూర్తిస్థాయి సాధికారత కావాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగ విరుద్ధమైన రీతిలో జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి పంచాయతీ లను ఇంకా నిర్వీర్యం చేశారన్నారు. ఈ కమిటీలను రద్దు చేయాలన్నారు. కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, పంచాయతీల్లో మంత్రులు, ఎమ్మెల్యేల జోక్యం పెరగటం ఆయా పాలకవర్గాల స్వేచ్ఛను హరించటమేనన్నారు. తూర్పు గోదావరి జిల్లా జనాభాను పరిశీలిస్తే, ప్రపంచంలోని 116 దేశాల్లో కంటే ఎక్కువని, అలాంటి ప్రాంతం మీద అమరావతి, ఢిల్లీ పెత్తనం వినటానికే హాస్యాస్పదంగా ఉందని అన్నారు. అధికారాన్ని వికేంద్రీకరించి, స్థానిక ప్రభుత్వాల సాధికారతతో జనం చేతికి తీసుకెళ్లటం ద్వారా, ఫెడరలిజాన్ని బలోపేతం చేయటం ద్వారా మాత్రమే మనదేశంలో మనం కోరుకుంటున్న మార్పు సాధ్యమవుతుందన్నారు.

చిన్నరాజప్ప మాట్లాడుతూ, తాను కూడా తూర్పు గోదావరి ఉప్పలగుప్తం నుంచి మండల పరిషత్తు అధ్యక్షుడిగా పనిచేశానన్నారు. మండల పాలనను సమర్థంగా నిర్వహించటంతో తెదేపా జిల్లా అధ్యక్షుడిగా అవకాశమొచ్చిందన్నారు. అక్కడ్నుంచి ఉప ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగానన్నారు. స్థానిక సంస్థల్లో పనిచేసిన అనుభవం రాజకీయాల్లో రాణించేందుకు పెద్ద బాలశిక్షలా దోహదపడు తుందన్నారు. స్థానిక పాలనకు సంబంధించి సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీ ఛైర్మన్లుగా పనిచేసిన ఎందరో కీలక పదవుల్లో రాణించారన్నారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు దాటినా గ్రామాలకు పూర్తిస్థాయి అధికారాలు రాలేదని శాసనమండలి ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రస్తుత పదవికన్నా సర్పంచ్ పదవే తనకు ఎక్కువ సంతృప్తినిచ్చిందన్నారు.

జన్మభూమి కమిటీల ద్వారా గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని కాకినాడ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు చెప్పగా.. మంచినీటి ప్రాజెక్టు కోసం ఓ కార్పొరేట్ సంస్థ ద్వారా రూ.2 కోట్ల నిధుల్ని సమకూరిస్తే, జన్మభూమి కమిటీల వల్ల వచ్చిన నిధులు వెనక్కిపోయాయని ఐ.పోలవరం మండలం ఎదుర్లంక ఎంపీటీసీ రాజ్ వర్మ ఆవేదన వ్యక్తం చేశారు. జడ్పీటీసీగా సామర్లకోట మండలంలో అనేక పనులు పూర్తి చేశామని రూరల్ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి అన్నారు.

జడ్పీ మాజీ ఛైర్మన్ దున్నా జనార్ధనరావు మాట్లాడుతూ, కేరళలో పంచాయతీరాజ్ వ్యవస్థ మనకంటే మెరుగ్గా ఉందన్నారు. ప్రస్తుతం విధానాన్ని మార్చి బలమైన మూడంచెల వ్యవస్థను నిర్మించాలని మాజీ ఎంపీపీలు పీకే రావు, అత్తిలి సీతారామస్వామి కోరారు. ఎంపీపీలు టి.బిందుమాధవ రావు, ముల్లంగి గౌరి, గింజాల సింహాద్రిరాజు, నెక్కంటి బాలకృష్ణ తదితరులు ప్రసంగించారు.

సదస్సు అనంతరం చినరాజప్పను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కటకంశెట్టి బాబి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వై.మాలకొండయ్య, గౌరి, పలువురు పూర్వ ఎంపీపీలు, తదితరులు పాల్గొన్నారు. సబ్బెళ్ల గంగిరెడ్డి సదస్సును సమన్వయ పరిచారు. ★



# రేప్‌లను ఆపేదెలా?

## ('దాచేపల్లి' పాఠం)

దాచేపల్లి పేరు వినగానే తరాల అంతరాలను దాటి గుర్తొచ్చేది స్కూలు పుస్తకాలను ప్రచురించే సంస్థ! 1908 నుంచి దాచేపల్లి పుస్తకాలు తెలుగునాట ప్రచురితమవుతున్నాయి. అక్షరమాల పరిచయం, గుండ్రని చేరాతకు కాపీ రైటింగ్ నుంచి రకరకాల పాఠశాల పుస్తకాలను దాచేపల్లి పబ్లిషర్స్ అందిస్తున్నారు. ఇప్పుడైతే ఉన్నత విద్యలో కూడా దాచేపల్లి పాఠ్యపుస్తకాలు ప్రాచుర్యం పొందాయి. గుంటూరు జిల్లా దాచేపల్లికి దాచేపల్లి పబ్లిషర్స్‌తో ఉన్న సంబంధమేంటో స్పష్టంగా తెలియకపోయినా.. ఈ దాచేపల్లి ప్రాంతం కూడా రైలు ప్రయాణం ద్వారా చాలామంది ప్రజానీకానికి పరిచితమే. మద్యం బెల్టు షాపుల వేలంపాటలు, ఎన్నికల్లో కళ్లు చెదిరే డబ్బు ఖర్చు ద్వారా రాజకీయంగా కూడా దాచేపల్లి బాగా పాప్యులర్ అయింది. దాచేపల్లిలో సర్పంచ్ స్థాయి ఎన్నికకు దాదాపు మూడు కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్టు వార్తలు రావటం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద సంచలనమే సృష్టించింది. బహుశా భారతదేశంలోనే ఈ రికార్డును ఇంతవరకూ ఎవరూ అధిగమించలేదేమో! రాష్ట్ర విభజన తర్వాత గుంటూరు జిల్లా దాచేపల్లి ఇటీవల ఓ దిక్కుమాలిన సంఘటనతో మళ్లీ పెనుసంచలన వార్తల్లోకొచ్చింది.

దాచేపల్లిలో తొమ్మిదేళ్ల బాలికపై 55-60 ఏళ్ల వయస్కుడు రామసుబ్బయ్య చేసిన లైంగిక అత్యాచారం రాష్ట్రాన్ని, ఇతర ప్రాంతాల్లోని తెలుగువారినీ కుదిపేసింది. జమ్మూ కాశ్మీర్‌లోని కథువా, యూపీలోని ఉన్నావ్ అత్యాచార ఘటనలపై ప్రధానమంత్రి, ఆయన పార్టీ నేతలు ఎలా స్పందించారో, దాచేపల్లి ఘటనపై నేనెలా స్పందించానో పోల్చిచూసుకోండి అన్నట్టుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ సంఘటనపై ప్రచారహోరుతో స్పందించారు ('ఆడబిడ్డలకు రక్షణగా కదులుదాం' పేరుతో నిర్వహించిన ఓ ర్యాలీలో ఈ మాటను ఆయన బహిరంగంగానే అనేశారు). బాలికలు, మహిళలపై అత్యాచారాలకు పాల్పడితే దోషులకు భూమ్మీద అదే చివరిరోజు అవుతుందని, కావాలంటే టెస్ట్ చేసి చూసుకోండి అని సవాలు కూడా చేశారు. అయితే, ముఖ్యమంత్రి ఈ మాటల్ని చెప్పినరోజునో, ఆ మరుసటి రోజునో గుంటూరు జిల్లా చుండూరు మండలం మోదుకూరులో ఓ బాలికపై అత్యాచారం కేసు నమోదైంది. ఇంకోచోట ఓ దివ్యాంగురాలిపై అత్యాచారం.. ఇలా శ్రీకాకుళం నుంచి చిత్తూరు దాకా పలు వార్తలొచ్చాయి. అయినా మన విధానంలో ఏదో లోపం ఉందని ముఖ్యమంత్రికి, చుట్టూ ఉన్న బృందానికి తట్టలేదు.

ఎంత అమానుషమైనా కులం పేరుతో వివక్ష మామూలే అనుకునే మనదేశంలో, లైంగిక దాడుల్ని, అత్యాచారాల్ని కూడా పురుషాధిక్యంలో భాగంగానే చూస్తారనేది కఠోర వాస్తవం. రేప్ అంటే టీ తాగినంత చిన్న విషయం.. అని కేరళలో వామపక్షాలకు చెందిన ఒక ముఖ్యమంత్రే వ్యాఖ్యానించారు. భార్యపై రేప్‌ని నేరంగా భావించలేం అని సుప్రీంకోర్టే వ్యాఖ్యానించిన దేశమిది! ఎదుటివారిని కించపరచటానికి ఉపయోగించే బూతులు కూడా చాలామేర మహిళలను కించపరిచేవిగానే ఉంటాయి. అయితే మనదేశంలో కుటుంబ వ్యవస్థ బలంగా ఉండటంతో స్త్రీని ఒక విలువైన సొత్తుగా భావించటం, పూజనీయంగా చూడటం కద్దు. ఇంట్లోని మహిళలపై ఎవరైనా అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసినా, అఘాయిత్యాలకు పాల్పడినా చాలా తీవ్రంగా పరిగణిస్తాం. ఒక సమాజంగా కూడా ఇలాంటి ఘటనలపై తీవ్రంగా స్పందించి దోషులపై విరుచుకుపడుతుంటాం. అయితే, మహిళతో ఆమె అంగీకారం లేకుండా శారీరక సంపర్కం పెట్టుకోవటం హింసాత్మక దాడితో సమానమేనని, అటువంటి లైంగిక అత్యాచారానికి పాల్పడితే ఆమె శీలమేమీ అపవిత్రమైపోదని మాత్రం మనం అంగీకరించం. పురుష పౌరుల మీద హింసాత్మక దాడులు జరగటం ఎలా చట్టబద్ధపాలన వైఫల్యమో, స్త్రీలపై ఇంటాబైటా జరిగే లైంగికదాడి, అత్యాచారం కూడా అలాంటి చట్టబద్ధ పాలన వైఫల్యమేననే అవగాహనను ప్రదర్శించం.. ఇన్ని వైరుధ్యాల మధ్య ఓ లైంగికదాడి మీద ముఖ్యమంత్రి స్పందన ఎలా

జాతీయ నేరగణాంక సంస్థ లెక్కల ప్రకారం 2016లో దేశంలో బాలలపై సగటున రోజుకు 293 నేరాలు చోటు చేసుకున్నాయి. వాటిలో 98 లైంగిక దాడులు, అత్యాచారాలకు సంబంధించినవే. బాలలపై జరుగుతున్న నేరాల్లో అత్యధిక శాతం వాటా అపహరణలది కాగా, వాటి తరువాతి స్థానం లైంగిక దాడులు, అత్యాచారాలదే. ఆంధ్రప్రదేశ్‌లో సగటున ఐదు, తెలంగాణలో ఎనిమిది నేరాలు చోటుచేసుకుంటున్నాయి. వీటిల్లో లైంగిక దాడులు, అత్యాచారాల ఘటనలు ఏపీలో రోజుకు సగటున రెండు, తెలంగాణలో మూడు జరుగుతున్నాయి. 2014తో పోలిస్తే 2016 నాటికి దేశవ్యాప్తంగా బాలలపై నేరాలు 19.61 శాతం మేర పెరగ్గా, వాటిల్లో లైంగిక దాడులు, అత్యాచారాల ఘటనలు 4.40 శాతం మేర పెరిగాయి. అత్యాచారాల బాధితుల్లో 43.2 శాతం మంది మైనర్ బాలికలే. వారిలోనూ 5.4 శాతం మంది పన్నెండేళ్ల లోపు చిన్నారులే!

ఉండాలి? అందునా ఓ బాలికపై జరిగినప్పుడు ఎంత నిర్మాణాత్మకంగా స్పందించాలి?.. ఇటువంటి ఆలోచనే లేకుండా ప్రధానంగా ప్రచార దృష్టితోనే ముఖ్యమంత్రి స్పందించారు.

దాచేపల్లిలో జరిగిన లైంగిక అత్యాచారం తీవ్రాతితీవ్రంగా పరిగణించాల్సిన నేరమనటంలో సందేహం లేదు. ఆ బాలిక కుటుంబానికి నగదు రూపంలో నష్టపరిహారంతోపాటు ఇతరత్రా తోడ్పాటునూ అందించటం సముచితం. కానీ నిర్భయ ఘటన జరిగాక, ఎంతో చర్చ జరిగి ఓ బలమైన చట్టం వచ్చాక కూడా మహిళలపై అత్యాచారాలు ఎందుకు ఆగటం లేదు? అనే ప్రాథమిక ఆలోచనను ఏపీ ప్రభుత్వం చేయలేదు. అత్యాచారాల కేసుల విచారణకు కాలవ్యవధితో కూడిన ప్రత్యేక కోర్టు ఏర్పాటును చేస్తానని, లైంగిక దాడులు, అత్యాచారాల పట్ల తాను కఠినంగా ఉంటున్నాను కాబట్టి ఇక ఎవరూ ధైర్యం చేయరని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. కానీ ఏపీలోనే విశాఖపట్నం జిల్లా ఏజెన్సీ ఏరియా వాకపల్లిలో గిరిజన మహిళలపై సామూహిక అత్యాచార ఘటన జరిగి పదేళ్లయినా ఇప్పటికీ న్యాయం జరగలేదని, సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసి ఆరు నెలల్లోగా కేసును తేల్చాలని చెప్పి ఎనిమిది నెలలైనా అతీగతీ లేదని, ఇటీవలే ప్రత్యేక ప్రాసిక్యూటర్‌ని నియమించారని ఆయన దృష్టికి వచ్చినట్టు లేదు. పోలీసులను, ప్రాసిక్యూషన్‌ను రాజకీయ నేతలు గుప్పెట్లో పెట్టుకుని చెలాయిస్తుండటం వల్ల సామాన్యులకు న్యాయం అందని ద్రాక్షగా మారిందని, కేవలం నూటికి ఆరు కేసుల్లో మాత్రమే నేరస్తులకు శిక్షలు పడుతున్నాయని, ఇదే అన్యాయానికి మూలమని ముఖ్యమంత్రి విస్మరించారు (నేరాలను బలవంతంగా ఒప్పించిన ఉదంతాల్ని తీసుకున్నా కూడా.. 2014-16 మధ్య బాలలపై నేరాలకు సంబంధించి దేశంలోనే అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లో నూటికి 89 కేసులు వీగిపోయాయి. రాష్ట్రంలో 2,558 కేసుల విచారణ పూర్తికాగా, 278 కేసుల్లోనే శిక్షలు పడ్డాయి. బాలలపై అత్యాచారాలకు సంబంధించి 2,239 కేసుల విచారణ పూర్తయిన తెలంగాణలో నూటికి 87 కేసులు వీగిపోయాయి). అత్యాచారాలకు వ్యతిరేకంగా నిర్భయ ఘటనపై చేసిన దానికంటే గొప్ప ఆందోళనల్ని ఏమీ చేయలేరు గదా! అన్ని ఆందోళనలు, అంత పదునైన చట్టం వచ్చాక కూడా ఆగని అత్యాచారాల్ని.. ముఖ్యమంత్రి ఉపన్యాసాలతో, పైపై హామీల ప్రదర్శనలతో ఆపగలరా? అత్యాచారాలపై మన ప్రజానీకంలో చాలినంత స్పందన ఇప్పటికే ఉన్నప్పుడు.. మళ్లీ 'మీ టూ' ఉద్యమంలాగా ప్రచార హడావుడి ఎందుకు?

అలాగే జస్టిస్ జేఎస్ వర్మ కమిటీ ఎంతో చర్చించి, ఎంతోమంది నుంచి సూచనల్ని స్వీకరించి నిర్భయ చట్టాన్ని రూపొందించింది. ఆ వివరాలన్నీ అందుబాటులోనే ఉన్నాయి. మళ్లీ దాచేపల్లి సంఘటన తర్వాత ఇంకో కమిటీని వేయటం కాలయాపన కాదా? బాలికపై అత్యాచారాన్ని ఖండించటాన్ని, చర్యలు తీసుకోవడాన్ని కూడా ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లా తయారుచేస్తారా?

జిల్లాల్లో ఫోరెన్సిక్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తామని, పాఠశాలల్లో కూడా నైతిక విలువల్ని పెంపొందించే అంశాలు బోధించేలా చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. వీటిని ఆహ్వానించాలి. కానీ మూలాల్లో మార్పుల్లేకుండా ఈ చర్యలు చాలవు.

తీవ్రత, కొన్ని పరిష్కారాలు మారటం మినహాయించి.. బాలికలు, మహిళలు ఎవరి మీద జరిగినా లైంగిక అత్యాచారాల మూలాల్ని ఒకే సమస్యగా గుర్తించాలి. రాష్ట్రంలో అత్యాచారాలను నిరోధించాలని ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే, ముందు చట్టబద్ధపాలనను సరిచేయాలి. ఏ స్థాయి నేరస్తుడిపైనైనా పోలీసులు వేగంగా స్పందించి కఠిన చర్యలు తీసుకునేలా, వారికి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలి. కేసు దర్యాప్తు చేసే పోలీసులపై రాజకీయ పెత్తనం లేకుండా చట్టపరమైన మార్పుల్ని చేయాలి. పోలీసు సంస్కరణలంటే.. డీజీపీ నియామకం ఎలా చేయాలి, ఎవరు చేయాలి అనే నిబంధనల్ని మార్చటం కాదు. పోలీసులు సమర్థవంతంగా, జవాబుదారీతనంతో, ప్రజల పట్ల సేవాభావంతో పనిచేసేలా డిపార్ట్‌మెంట్‌ను తీర్చిదిద్దటం. ముఖ్యంగా స్థానికంగా పోలీసులు

కమ్యూనిటీలతో కలిసి పనిచేసేలా ఉండాలి. ఇందుకోసం స్థానిక ప్రభుత్వాలను పటిష్టం చేయాలి.



### మహిళల్లో విశ్వాసాన్ని పెంచే స్థానిక కోర్టులు

మహిళలపై అత్యాచారాల దాకా పురుషులు తెగించకుండా, వేధింపుల వంటి చిన్న నేరాల దశలోనే వారిని కట్టడి చేసేలా 'స్థానిక కోర్టుల్ని' ఏర్పాటు చేయటం ఇక్కడ చాలా ముఖ్యమైన విషయం. తెలంగాణలో 'షీ బృందాలు' కేసుల్నయితే బాగానే నమోదు చేయగలుగుతున్నాయిగానీ, సకాలంలో వేగంగా విచారణ జరిగే ఏర్పాటు లేకపోవటం వల్ల శిక్షలు పడేలా చేయలేకపోతున్నాయి. లోక్‌సత్తా 2009లో సాధించిన గ్రామ న్యాయాలయాల చట్టం ద్వారా ఇలాంటి స్థానిక కోర్టుల్ని ఏర్పాటు చేసుకోవచ్చు. అమ్మాయిల్ని వేధించినవారికి బెత్తం దెబ్బలు వంటి చిన్న శిక్షల్ని తొలి దశలోనే విధిస్తే.. అత్యాచారాల దాకా వారు వెళ్లే అవకాశం తక్కువ. వేగంగా, తేలిగ్గా, తక్కువ ఖర్చుతో విచారణలు జరిగి శిక్షలు పడుతుంటే, పోలీసులు రాజకీయ జోక్యం లేకుండా సమర్థంగా పనిచేస్తుంటే.. మహిళలు కూడా స్వేచ్ఛగా ముందుకొచ్చి ఫిర్యాదులు చేస్తారు. సాక్షులు కూడా సహకరిస్తారు. ఈ ఏర్పాట్లతో లైంగిక అత్యాచారాల నేరాలను ప్రాథమికంగా కట్టడి చేయటానికి ఒక వాతావరణం ఏర్పడుతుంది.

ప్రజాస్వామిక దృష్టితో బాలికల్ని, మహిళల్ని సమానంగా చూసే శక్తిని సమకూర్చటంలో నాణ్యమైన పాఠశాల విద్య పాత్ర కీలకమైంది. కానీ దేశంలోని పలు రాష్ట్రాల్లోలాగానే ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్య అధ్వాన్నంగా ఉంది. ఒక్కో విద్యార్థి మీదా ఏటా రూ. 60,000-70,000 ఖర్చు చేస్తున్నా.. చదువుల్లో ప్రమాణాలు లేవు. విషయాల్ని కొత్తగా ఆలోచించి పరిష్కారాలు చెప్పటం సంగతి అలా వుంచి.. అసలు విషయాల్ని చదవటం, గణించటం, అంచనా వేయటం చేతకాని వారే యాభై శాతానికి పైగా ఉన్నారు. నెలకి రూ. 25,000 లోపు వార్షిక ఫీజు తీసుకుంటున్న కొన్ని ప్రైవేటు స్కూళ్లు అంతకంటే మెరుగైన చదువులు అందిస్తున్నాయి. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసి నాణ్యతా ప్రమాణాల్ని పెంచితే.. నైపుణ్యాలు, వ్యక్తిత్వ విలువలు అందులో భాగంగానే పెరుగుతాయి. వాటికి అదనంగా లింగ వివక్ష, ఇతరత్రా సామాజిక రుగ్మతలపై అవగాహనను పెంచే కొన్ని పాఠ్యాంశాల్ని జోడిస్తే మంచి ఫలితాలస్తాయి. ఇదేసమయంలో స్కూళ్లలో మెంటారింగ్‌ను అమలుచేయాలి. మనస్తత్వ నిపుణులతో విద్యార్థులు చర్చించే అవకాశం కల్పించాలి. సాంకేతికత, పోటీ, వేగం పెరిగిపోతున్న ప్రపంచంలో మానసిక ఒత్తిడిని అధిగమించే సాధనాసంపత్తిని అందించటంపై ప్రభుత్వం గట్టిగా దృష్టి సారించటం అవసరం.

ఉపాధి నైపుణ్యాలను, వ్యక్తిత్వాన్ని ఇచ్చే చదువులు లేకుండా కేవలం విలువల్ని రుద్దితే.. వారు దాన్ని ఆచరణలో ప్రదర్శించే అవకాశాలు తక్కువగా ఉంటాయి. అందుకు తగ్గ ప్రోత్సాహకాలు వారికి కరువవుతాయి. ఉపాధి లేని చదువులతో వెల్లువెత్తే యువ జనాభాను కేవలం నీతివాక్యాలతో కట్టడి చేయటం అసాధ్యం.

### విచ్చలవిడి మద్యాన్ని దాటవేస్తున్న పాలకులు

దీనికితోడు, మద్యాన్ని విచ్చలవిడిగా పారించటం! చాలా లైంగిక అత్యాచారాలు మద్యం మత్తులోనే జరుగుతున్నాయని, రాష్ట్రంలో ఎక్కడబడితే అక్కడ మద్యం అందుబాటులో ఉండటం మహిళలు, బాలికల పాలిట శాపంగా మారిందని తెలిసినా.. ఎక్కడా ఆ ప్రస్తావన రాకుండా ముఖ్యమంత్రి జాగ్రత్త పడ్డారు. జూదం మత్తు అన్నారేగానీ, మద్యం మత్తు అనే కోణంలోకి చర్చను వెళ్లనీయకుండా కట్టడి చేశారు. అత్తెసరు చదువులు, నిరుద్యోగ భృతి, అందుబాటులో మద్యం, ఉచితంగా స్మార్ట్‌ఫోన్.. ఇంతకంటే అత్యాచారాలకు అనుకూలమైన పరిస్థితులు ఏ సమాజంలోనైనా ఏముంటాయి?

ఇక కుటుంబ వ్యవస్థ పాత్ర!

అత్యాచారాల నిరోధానికి కుటుంబ వ్యవస్థ పాత్రను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి! అయితే ఇది కళ్లు మూసుకుని చేసేయకూడదు. కుటుంబ జీవనాన్ని ప్రోత్సహిస్తూ అందులోని మంచిని బలోపేతం చేయాలి. బాలికలపై లైంగిక దాడులు, అత్యాచారాలకు పాల్పడేవారిలో తెలిసినవారే ఎక్కువగా ఉన్నారని, వారిలో కుటుంబ సభ్యులు కూడా ఉన్నారని గణాంకాలు తెలియచేస్తున్నాయి. అయితే బంధువులను మినహాయిస్తే, ఒక యూనిట్‌గా పరిగణించే కుటుంబసభ్యులు (తల్లిదండ్రులు, పిల్లలు) లైంగిక దాడులకు పాల్పడే సంఘటనలు తక్కువ. మద్యాన్ని నియంత్రిస్తే ఈ సంఖ్య ఇంకా తగ్గుతుంది. బెల్టుషాపులకు వ్యతిరేకంగా లోక్‌సత్తా మహిళా విభాగం మహిళాసత్తా చేసిన యాత్రలో.. తండ్రి తాగి రావటం వల్ల ఇంట్లో పడుకోకుండా బైట కాస్త నమ్మకస్తుల ఇళ్లలో పడుకుంటున్నామని చెప్పిన బాలికలు, యువతులు ఉన్నారు.

## ఏపీలో పరిహారం ఒక్కరికే

లైంగికదాడి బాధితులకు పరిహారం అందించటంలో అనేక రాష్ట్రాలు వెనుకబడి ఉన్నాయని జాతీయ న్యాయసేవల ప్రాధికార సంస్థ (నల్సా) సుప్రీంకోర్టుకు తెలిపింది. 2017లో ఆంధ్రప్రదేశ్‌లో 901 లైంగికదాడి, అత్యాచారం కేసులు నమోదుకాగా, కేవలం ఒక్క బాధితురాలికే పరిహారం అందిందనీ, 2016లో 850 కేసుల్లో 8 మంది, పోక్సో చట్టం కింద నమోదైన 1,028 కేసుల్లో 11 మంది మాత్రమే పరిహారం పొందారని వెల్లడించింది. నిర్భయ ఘటన తర్వాత మహిళల భద్రత, రక్షణకు సంబంధించి దాఖలైన పలు పిటిషన్లను సుప్రీంకోర్టు విచారిస్తోంది. దేశవ్యాప్తంగా లైంగిక దాడి, అత్యాచారం బాధితుల్లో కేవలం 5-10 శాతం మందికి మాత్రమే పరిహారం అందుతోందని నల్సా వివరించింది. రాజస్తాన్‌లో 2017లో 3,305 కేసులు నమోదుకాగా 140 మంది, బీహార్‌లో 1,119 కేసులకుగాను 82 మంది బాధితులు పరిహారం పొందారని పేర్కొంది. ఇంకా మిగతా రాష్ట్రాల నుంచి సమాచారం అందాల్సి ఉంది. నిర్భయ నిధిని బాధితులకు అందించటంలో రాష్ట్రాల నుంచి సహకారం అందటం లేదని కేంద్రం తరపు న్యాయవాది తెలిపారు.

జాతీయ నేర గణాంక సంస్థ 2015 నివేదిక ప్రకారం చూస్తే దేశవ్యాప్తంగా బాలల (కొందరు బాలురపైన కూడా)పై 8,800 అత్యాచార ఘటనలు పోక్సో చట్టం కింద నమోదు కాగా వాటిలో 8,341 ఘటనల్లో నిందితులు బాధితులకు తెలిసినవారే. అందులో 3,149 ఘటనల్లో బాధితుల ఇరుగుపొరుగువారే ఇలాంటి దురాగతాలకు పాల్పడ్డారు. 581 ఘటనల్లో సమీప బంధువులు, 210 ఘటనల్లో సన్నిహిత కుటుంబ సభ్యులు దారుణాలకు ఒడిగట్టారు. కుటుంబ వ్యవస్థలోని చెడు కంటే.. మంచే ఎక్కువగా కనిపిస్తున్న ఈ నేపథ్యంలో, లైంగిక అత్యాచారాల నిరోధానికి కుటుంబ సహకారాన్ని వినియోగించుకోవటమే మెరుగైన ఆలోచన అవుతుంది. ఎంత పరిచయస్తులైనప్పటికీ ఎవరితో ఎంత దూరం ఉండాలి, మంచి స్పర్శ, చెడు స్పర్శల మధ్య తేడా ఏంటి, అనుచిత ప్రవర్తనను ఎలా గుర్తించాలి.. వంటి వాటిపై కుటుంబంలో పిల్లలకు అవగాహన కలిగించాలి. ఏదైనా విషయాన్ని తమతో ధైర్యంగా చెప్పేలా వారిని ప్రోత్సహించాలి. పిల్లలకు సుద్దులు చెప్పటమే కాదు.. ఇంట్లోని పెద్దలెవరైనా లైంగిక దుశ్చర్యలకు పాల్పడినా పర్యవసానాలు కఠినంగా ఉంటాయన్న సంకేతం ప్రతి కుటుంబంలోనూ అంతర్గతంగా పాదుకోవాలి. అలాగే బాలికల్ని కూడా బాలురతో సమానంగా చూడటం, బాలికల్ని గౌరవించటాన్ని బాలురకు నేర్పించటం వంటివి ఇంటి నుంచే మొదలుపెట్టించాలి. తల్లిదండ్రులు లింగసమానత్వాన్ని నేర్పిస్తూ పర్యవేక్షిస్తుంటే.. బాలురు తప్పులు చేసే అవకాశం తక్కువ. బాలికలపై అత్యాచారాలకు పాల్పడుతున్నవారిలో మైనర్ బాలురు, యువత సంఖ్య ఇటీవల ఆందోళనకరస్థాయిలో పెరుగుతోందని మనం గుర్తెరగాలి.

17 పోలీసు బృందాలతో దిగ్బంధం చేయటంతో భయపడి దాచేపల్లిలో బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ సుబ్బయ్య ఆత్మహత్యకు పాల్పడ్డాడని ముఖ్యమంత్రి చెబుతున్నా.. అతని ఆత్మహత్యకు ఒకరకంగా కుటుంబ విలువలే కారణ మయ్యాయని నిందితుని మరణవాంగ్మూలంలాంటి ఫోన్ సంభాషణ తెలియజేస్తోంది. బిడ్డలకు, ఇతరులకు నీతులు చెబుతూండే తాను ఇలా చేయటమేంటి, ఛీ అనిపించి ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు నిందితుడు చెప్పాడు. అలా చనిపోవటం బలహీనతే కావచ్చు, అవాంఛనీయమే కావచ్చు.. కానీ కుటుంబ విలువలను సరిగా పునర్నిర్మించుకుంటే ఎలాంటి మానవీయ ఫలితాలను సాధించవచ్చో ఆ విషాద ఘటన తెలియజేస్తోంది.

### లోతుకెళ్లని చర్చ.. జుగుప్స కలిగించే రాజకీయం

దాచేపల్లి ఘటనపై న్యూస్ ఛానళ్లలో కూడా చాలా చర్చ చేశారు. నిర్భయ లాంటి చట్టమున్నా ఎందుకిలా అత్యాచారాలు కొనసాగుతున్నాయి, ఏం చేయాలి అని చిత్తశుద్ధితోనే పలువురు స్పందించారు. అయితే ఈ చర్చలో లోతుకు వెళ్లటంలో, పరిష్కారాన్ని సమగ్రంగా ఆవిష్కరించటంలో మాత్రం సఫలం కాలేకపోయారు. చట్టాలతో ఉపయోగం లేదని కొందరు, మనుషుల్లో మానవీయతను పెంపొందించే కార్యక్రమాల్ని నిర్వహించాలని ఇంకొందరు, నైతిక విలువలు పతనమయ్యాయని, టెక్నాలజీ మోజులో కొట్టుకుపోతున్నారని.. ఇలా చెప్పుకొచ్చారు. తెలుగునాట సామాజిక అవగాహనను పెంచే రాజకీయం ఆవశ్యకత ఎంతగా ఉందో తెలియజేసేలా ఈ చర్చలు సాగాయి. ఇక రాజకీయ పార్టీల తీరు కూడా జుగుప్సను కలిగించేలా ఉంది. ప్రతిపక్ష వైకాపా నేతలు దీన్ని కూడా రాజకీయంగా ఉపయోగించుకునే ప్రయత్నం చేశారు. దాచేపల్లి ఘటనకు ముఖ్యమంత్రి, ఆయన పార్టీయే కారణమని బాధ్యతారహితమైన ఆరోపణలు చేశారు. దొందూ దొందే అన్నరీతిలో తెలుగుదేశం వారు కూడా సుబ్బయ్యతో వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్ ఉన్న ఫోటోలను చూపుతూ

హీనరాజకీయం చేశారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సైతం నిందితుల్ని రాళ్లతో కొట్టి చంపాలని ఆటవిక యుగంలోలా మాట్లాడారు.

రాష్ట్రంలోనే కాదు.. కేంద్రంలో మోదీ ప్రభుత్వానిదీ ఇదే తరహా వ్యవహారశైలి. కథువా దారుణంపై ప్రధానమంత్రి చాలా ఆలస్యంగా స్పందించారు. అది కూడా ప్రజాగ్రహం వెల్లువెత్తటంతో. ఏదో చేసినట్టు కన్పించాలన్నట్టు మంత్రివర్గాన్ని సమావేశపరిచి పోక్సో చట్టాన్ని కఠినతరం చేస్తూ ఆదేశాలు విడుదల చేశారు (బీజేపీ సారథ్యంలో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడ్డాక నాలుగున్నర లక్షల అత్యాచార ఘటనలు జరిగాయని, ఇందులో ఎంతమందిని ఉరి తీయగలరని బాలల హక్కుల సంఘం నేతలు ప్రశ్నిస్తున్నారు). విచారణను కాలపరిమితిలోగా పూర్తి చేయని కోర్టుల్లో బాధ్యులను గుర్తించి ఎలాంటి చర్యలూ తీసుకోలేకపోతున్నారని తెలిసినా, మళ్లీ అదే సవరణను వల్లెవేశారు. దీనివల్ల అత్యాచారాలు అదుపులోకి వస్తాయా, లేదా అన్న చర్చ కన్నా.. రాజకీయ ప్రయోజనాలకే జాతీయస్థాయి ప్రభుత్వం కూడా ప్రాధాన్యమిచ్చింది.

### మధుమిత పాండే ఇంటర్వ్యూల్లోనూ ఇదే తేలింది

చట్టబద్ధపాలన, స్థానిక కోర్టుల ఏర్పాటు, పోలీసు వ్యవస్థలో రాజకీయ జోక్యం లేకుండా సంస్కరణలు, కుటుంబ వ్యవస్థలోని మంచిని పెంచటం, కఠిన మద్యనియంత్రణ, సరైన పాఠశాల విద్య, నిరుద్యోగ భృతి వంటి తాయిలాలు కాకుండా ఉపాధి అవకాశాల పెంపు.. వీటన్నిటి కోసం పూర్తిస్థాయి ప్రయత్నం ఏకకాలంలో జరిగితేనే మహిళలపై నేరాలు అదుపులోకి వస్తాయి.

మధుమిత పాండే అనే యువ పరిశోధకురాలు భారత్‌లో రేప్ సంస్కృతి మీద చేసిన అధ్యయనం కూడా ఇదే విశ్లేషణను, ఇవే పరిష్కారాలను ధృవీకరించేలా ఉంది. దారుణమైన లైంగిక దాడులకు పాల్పడ్డ నేరస్తులను ఆమె జైలులో కలుసుకుని ఇంటర్వ్యూ చేశారు. వారిలో అతి కొద్దిమంది తప్ప మిగిలినవారెవరూ తాము చేసిన పనికి పశ్చాత్తాప పడటం లేదని మధుమిత తెలిపారు. వాళ్లంతా పెద్ద ఆలోచన, అవగాహన ఉన్నవారు కాదని, లైంగిక చర్యకు మహిళ అనుమతి ఎందుకు అవసరమని భావించే బాపతని వెల్లడించారు. తమ పురుషత్వాన్ని చాటుకోవడానికి సెక్స్‌ను ఒక మార్గంగా వారు భావిస్తున్నారని, అందులో తప్పులేదని ఇప్పటికీ అనుకుంటున్నారని తెలిపారు. మన రాజకీయ సంస్కృతిలో జనాన్ని వెర్రెక్కించటం, పూనకాలు వచ్చేట్టు చేయటం తప్ప ఆలోచించేలా చేయటం లేనప్పుడు, నాణ్యమైన విద్య మన ఎన్నికల ఎజెండా కానప్పుడు.. మనిషిలోని బేసిక్ ఇన్‌స్టింక్ట్‌గా ఉండే సెక్స్ కూడా ఇలా ఆలోచనారహితంగానే వ్యక్తమయ్యే ప్రమాదముంటుంది. ముఖ్యమంత్రి సహా పలు పార్టీల నేతల రాజకీయ వ్యవహారశైలిని చూస్తే జంతుసంస్కృతి కంటే పెద్దమెరుగ్గా ఏమీ కనిపించవు. జంతు లక్షణాలు, ఉన్మాదాలు లేకుండా జనంలో ఆలోచనను పెంచే రాజకీయం, పాలన, ఇతర సామాజిక కలాపాలు ఉంటే.. అది కూడా రేప్‌లాంటి హింసాత్మక దాడులను కట్టడి చేయగలుగుతుంది. రేప్‌లను నిరోధించటం, రేప్‌కు పాల్పడ్డవారికి సకాలంలో సరైన శిక్ష పడేట్టు చేయటం, ఆ శిక్ష ద్వారా వారు తమ తప్పును గుర్తించేలా చేయటం కాకుండా.. రేప్ చేసినవాళ్లను ద్వేషించండి, వారిని అంతం చేయండి అని రెచ్చగొడుతూ ప్రచారం పొందటానికి పాలకులు ప్రాధాన్యమిస్తుంటే బాధితులకు ఎప్పటికీ న్యాయం జరగదు.

జైళ్లలో శిక్ష అనుభవిస్తున్నవారిలో కూడా మార్పు తేలేనిరీతిలో మనం లైంగిక దాడుల పట్ల చర్యలు తీసుకుంటూ, ఆడపడుచులను ఉద్ధరిస్తున్నామని డబ్బా కొట్టుకుంటుంటే అంతకన్నా అపహాస్యపు పాలన వేరే ఉంటుందా?

ఇలా నేరాలకు సరైన శిక్షల్ని విధించటంలో, ఇతరత్రా చర్యల్లో విఫలమవుతుంటే, కొన్నాళ్లకి నేరాలకి అలవాటు పడిపోయి సమాజం ఇంకా దిగజారుతుంది. మీడియాలో ఒక క్రూరమైన జోక్ నడుస్తుంటుంది. ఉద్యోగంలో చేరిన కొత్తలో ఒక మనిషి చనిపోయినా సదరు జర్నలిస్టు ఎంతో ఆర్తితో వార్తను అందిస్తాడట. కానీ అలాంటి ఘటనలపై తగిన స్పందనలు, పరిష్కారాలు కరవైతే.. కాలక్రమంలో ఆ వార్తలకి అలవాటు పడిపోయి, స్కోరెంత? అంటూ ఎంతమంది చనిపోయారు అనే దాన్ని బట్టే వార్తను వేయాలనుకుంటాడట. రైతుల ఆత్మహత్యల వార్తలు సింగిల్ కాలమ్‌కి పరిమితమవటం చూస్తూనే ఉన్నాం. రైతుల సంక్షోభాన్ని ప్రసారం చేయని టీవీ ఛానళ్లు కూడా చాలానే ఉన్నాయి. నిర్భయ కంటే భయంకరంగా అత్యాచారానికి గురైన దళిత మహిళల్ని మీడియా, సమాజం పట్టించుకోని సందర్భాలు అనేకం. నిర్భయ ఘటన కంటే ముందు, తర్వాత కూడా. మహిళలపై లైంగిక అత్యాచారాలు మున్ముందు కూడా రొటీన్ వార్తలు మిగిలిపోకూడదంటే.. కచ్చితంగా ఇప్పుడున్న ఆగ్రహాన్ని, ఆక్రోశాన్ని సరైన రీతిలోకి మళ్లించి హేతుబద్ధ పరిష్కారాల్ని అమలు చేయటం అవసరం. మగాడంటే ఇలా లైంగికహింస సహా ఆధిపత్యం చెలాయిస్తుంటాడనే పురుషాధిక్యత భావన నుంచి సమాజాన్ని బైటపడేయాలి. ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు, తెలంగాణ సహా యావత్ దేశంలో రావాల్సిన మార్పులివి! ★

# అత్యాచారాలపై ప్రభుత్వాలు, పెద్దల తీరుని కడిగేసిన పిల్లలు

## -బాలల హక్కుల సంఘం, వైబీఐ ఆధ్వర్యంలో పెయింటింగ్ పోటీ-



**బా**లలపై అత్యాచారాలు-నిరోధానికి చర్యలపై బాలల హక్కుల సంఘం, యూత్ ఫర్ బెటర్ ఇండియా (వైబీఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాథమికోన్నత పాఠశాల స్థాయి చిత్రలేఖనం పోటీలో పలువురు విద్యార్థినీవిద్యార్థులు 'మార్పు కోసం మేము సైతం..' అన్నట్టు సమరోత్సాహంతో పాల్గొన్నారు. హైదరాబాద్ దిల్‌షుక్‌నగర్‌లోని అనీబిసెంట్ విమెన్స్ కళాశాల ఇందుకు వేదికైంది.

12-15 ఏళ్ల వయసున్న పలువురు విద్యార్థులు పెయింటింగ్‌ల ద్వారా తమలోని ఆవేదనను, ఆక్రోశాన్ని వ్యక్తం చేయగా, కొందరు ఆయా అంశాలపై తమ భావాలకు అక్షరరూపం కూడా ఇచ్చి ప్రసంగాల ద్వారా వ్యక్తం చేశారు. వీరి ప్రసంగాలకు తల్లిదండ్రులు కూడా ఉప్పొంగిపోయారు.

అమ్మాయిలు-అబ్బాయిల మధ్య తల్లిదండ్రులు పెంపకంలో వివక్ష చూపకూడదని, కుటుంబంలో, సమాజంలో కూడా లింగసమానత్వం పట్ల చైతన్యాన్ని పెంచాలని శ్రీజ అనే విద్యార్థిని పేర్కొంది. ప్రభుత్వం చట్టబద్ధపాలనను సక్రమంగా అమలు చేయాలని బాలాజీ అన్నాడు. మన ఆలోచనల్లోనే తప్పు ఉందని, దీన్ని సరిచేయాలంటే.. మంచి చదువు ఉండాలని దీక్షిత అనే విద్యార్థిని స్పష్టంచేసింది. వేధింపులకు, అత్యాచారాలకు చోదకశక్తిగా పనిచేస్తున్న మద్యాన్ని ప్రభుత్వాలు ఎందుకు విచ్చలవిడిగా ప్రోత్సహిస్తున్నాయని ప్రశ్నించింది. అమ్మాయిలు తమను తాము రక్షించుకోవటానికి మార్షల్ ఆర్ట్స్, ఇతర పద్ధతుల్ని నేర్పించాలని సూచించింది. దేశానికి స్వతంత్రం వచ్చి 71 ఏళ్లు దాటుతున్నా, ఇంకా మనం పెత్తందారీ స్వభావం నుంచి, బానిసత్వ భావాల నుంచి స్వతంత్రాన్ని పొందలేదని, అమ్మాయిలు నిర్భయంగా తలెత్తుకుని వ్యవహరించటం, అవగాహనతో తెలివిగా ప్రవర్తించటం, ఆశావహ దృక్పథంతో ఉండటం అవసరమని పదవ తరగతి విద్యార్థిని సునీత పేర్కొంది. పోలీసులు ప్రజల పట్ల సేవాభావంతో, గౌరవభావంతో వ్యవహరించాలని, లైంగిక నేరాలపై చిత్తశుద్ధితో, వేగంగా స్పందించాలని మరో విద్యార్థి అన్నాడు.






ఉత్తమ పెయింటింగులకు బహుమతులను ప్రదానం చేస్తామని బాలల హక్కుల సంఘం అధ్యక్షుడు అచ్యుతరావు, వైబీఐ కన్వీనర్ శివరామకృష్ణ తెలిపారు. బాలలపై నేరాలు పెరుగుతున్నా శిక్షలు తక్కువగా పడటం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేశారు. 2009లో వచ్చిన గ్రామ న్యాయాలయాల చట్టం ద్వారా స్థానిక కోర్టుల్ని ఎక్కడికక్కడ ఏర్పాటు చేస్తే.. వేధింపుల దశలోనే లైంగిక దాడుల్ని అడ్డుకోవచ్చని, క్రమంగా నిరోధించవచ్చని అన్నారు. స్థానిక కోర్టుల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వేసవి సెలవల్లో కూడా సామాజిక స్పృహతో ముందుకొచ్చిన విద్యార్థినీవిద్యార్థుల్ని వారు అభినందించారు. కాంపిటీషన్‌లో పాల్గన్న బాలలు ఎంతో పరిణతితో మాట్లాడారని, అత్యాచారాల నిరోధానికి ప్రభుత్వం, సమాజం కూడా చిత్తశుద్ధితో, పరిణతితో చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

అనీబిసెంట్ కళాశాల ప్రిన్సిపల్ శ్యాం సుందర్, వైబీఐ నేతలు క్రాంతి, అమృత్, కిరణ్, ప్రసన్న, నితీష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు. ★

# పై తరగతికి వెళ్లే కొద్దీ ప్రతిభ పతనం

**బడులను తిరిగి తెరుస్తున్నారు. ర్యాంకులు, యూనిఫాంలు, పుస్తకాల సంచులు, ట్యాబ్‌లు, ఫీజులు, రంగులేసిన తరగతి గదుల మీదే కాకుండా- వాటన్నిటి లక్ష్యమైన విద్యాప్రమాణాల మీద దృష్టి పెట్టాలని గుర్తుచేస్తున్న వాస్తవాలివి..**

ప్రపంచంలోనే ఎక్కడా లేనిరీతిలో ఎంత ఎక్కువ చదువుకుంటే అంత ఎక్కువ నిరుద్యోగమున్న భారతదేశంలో.. విద్యార్థులు పై తరగతులకు వెళ్తున్న కొద్దీ వారి అభ్యసన సామర్థ్యాలు కూడా పడిపోతున్నాయని కేంద్ర మానవ వనరుల శాఖ నిర్వహించిన జాతీయ సాధన సర్వే (నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే)లో తేలింది. పాఠశాల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసి అందుకనుగుణంగా పదో తరగతి నాటికి వారి ప్రతిభను మెరుగుపరిచే అవకాశాలను గుర్తించేందుకు ఈ సర్వే చేశారు. మాతృభాష, గణితం, సామాన్య-సాంఘిక అనే మూడు సబ్జెక్టులలో అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు సైన్స్, సోషల్ స్టడీస్ (ఎస్ఎస్‌టీ)లకు వేర్వేరు ప్రశ్నాపత్రాలు అందించారు. కేంద్ర మానవ వనరుల శాఖ పరిధిలోని జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) కొన్ని నెలల క్రితం దేశవ్యాప్తంగా 1.10 లక్షల ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని సుమారు 22 లక్షలమంది 3, 5, 8 తరగతుల విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించింది. దేశంలోని 700 జిల్లాల్లో పరీక్షలు జరపగా, జిల్లాలవారీగా విద్యార్థుల సగటు ప్రతిభపై నివేదికలను కేంద్రం విడుదల చేసింది. మూడు, అయిదు తరగతులకు మొత్తం 45 ప్రశ్నలు, 8వ తరగతికి 60 ప్రశ్నలను ఇచ్చారు.

దేశవ్యాప్తంగానూ, తెలుగు రాష్ట్రాల్లోనూ కాస్త అటూఇటుగా విద్యాప్రమాణాలు అధ్వాన్నంగా ఉన్నాయి. సురాజ్య యాత్రలో భాగంగా సైతం జేపీ పదే పదే చెప్పిన విషయాలనే ఈ సర్వే, దీనితోపాటు వెలువడిన 'అనర్' సర్వే



ప్రతిధ్వనించాయి. దేశాభివృద్ధిని దెబ్బతీసే పెద్ద విధ్వంసకర బాంబులు విద్యావైఫల్యాల రూపంలో టిక్.. టిక్ మంటున్నాయని, సకాలంలో మేలుకోకపోతే అవి టైం బాంబుల్లా పేలి జాతి భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని, యువ భారత శక్తి యువభారంగా మారుతుందని హెచ్చరించాయి.

### తెలంగాణ విద్యార్థుల ప్రతిభ సగటు కంటే దిగువనే

సామర్థ్యాన్ని వికసింపచేసే ఏర్పాట్లు లేకపోవటం వల్ల తెలంగాణలో విద్యార్థుల ప్రతిభ సగటు కంటే దిగువనే ఉన్నట్టు జాతీయ ఎచీవ్‌మెంట్ సర్వే తెలిపింది. రాష్ట్రంలో ఒక్కో జిల్లాలో ఒక్కో తరగతికి సంబంధించి 48-55 పాఠశాలల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. మూడులో 26,037, 5లో 29,700, 8వ తరగతిలో 37,900 మంది సర్వేలో భాగంగా పరీక్షలు రాశారు. 8వ తరగతిలో అన్ని సబ్జెక్టుల్లో ఆదిలాబాద్ జిల్లా విద్యార్థులు చివరి స్థానంలో నిలిచారు. గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రంలో సిద్దిపేట,

## 1857 తిరుగుబాటు జరిగినట్టే తెలియదు

కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన జాతీయసర్వేలో భాగంగా.. ఎనిమిదో తరగతి పిల్లలకు చరిత్రపై ఏమాత్రం అవగాహన ఉందో తెలుసుకునే ప్రయత్నం చేశారు. 1857 తిరుగుబాటు ప్రారంభం, స్వభావం, దాని విస్తృతి గురించి తెలియజేయమని అడిగారు. తెలుగు రాష్ట్రాల్లోని 58 శాతం మంది విద్యార్థులు తమకు అసలు అలాంటి తిరుగుబాటు జరిగినట్టే తెలియదని చెప్పటంతో సర్వేక్షకులు అవాక్కయ్యారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు రాజ్యాంగంపై ఏ మేరకు అవగాహన ఉందో తెలుసుకునే ప్రయత్నం చేయగా అరకొర సమాధానాలే లభించాయి. సామాన్యశాస్త్రంలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎంత ప్రతిభ ఉందో తెలుసుకునే ప్రయత్నంలో భాగంగా గుణగణాలను బట్టి మనుషులు, జంతువులు, పక్షులను వర్గీకరించమంటే 52 శాతం మంది చేతులెత్తేశారు. శరీర ఉష్ణోగ్రత, నాడి శబ్దం, కదిలే వస్తువుల వేగం, లోలకంలో సమయం గుర్తించగలరా అంటే తమ వల్లకాదని 52 శాతం మంది తేల్చిచెప్పారు.

ఐదో తరగతి విద్యార్థుల తెలుగుభాషా సామర్థ్యం తెలుసుకునేందుకు కథల పుస్తకాలు, వార్తాపత్రికల శీర్షికలు, ప్రకటనలు చదవండి అంటే 41 శాతం మంది తడబడ్డారు. పరిసరాల విజ్ఞానంలో ఐదో తరగతి విద్యార్థులను.. మీ తల్లిదండ్రుల సోదర, సోదరీమణులు, వారి సంతానం మీకు ఏమవుతారని అడగ్గా 35 శాతం మంది తెల్లముఖం వేశారు. గోడ గడియారం చూసి సమయం ఎంతయిందని మూడో తరగతి పిల్లలను అడగ్గా, వందకు 28 మంది బిక్కముఖం పెట్టారు. ఒకటి నుంచి 999 లోపల సంఖ్యలను దాదాపు నాలుగో వంతు విద్యార్థులు గుర్తించలేకపోవడం గణితంలో విద్యార్థుల వెనుకబాటుతనాన్ని తెలియజేస్తోంది. పాఠశాల గోడలపై గల 'సత్యమేవ జయతే', 'ఆరోగ్యమే మహాభాగ్యం', 'ఐకమత్యమే బలం' తదితర సూక్తులను సైతం మూడో తరగతి విద్యార్థుల్లో 24 శాతం చదవలేకపోవడం ఆందోళన కలిగించే అంశం. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, చెస్, కేరమ్స్ తదితర క్రీడల్లో ఎంతమంది ఆటగాళ్లు ఉంటారు, ఎన్ని పాయింట్లు ఉంటాయి, నిబంధనలు వివరించండి అని మూడో తరగతి విద్యార్థులను ప్రశ్నించగా 55 శాతంపైగా సరిగా స్పందించలేదు.

### సగం మందికి భాగాహారాలు రావు, 25 శాతం మంది మాతృభాషనే చదవలేరు

14 నుంచి 18 ఏళ్ల మధ్య ఉన్న గ్రామీణ యువతలో 25 శాతం మంది మాతృభాషలోని అంశాలనూ స్పష్టంగా చదవలేకపోతున్నారని అసర్ సర్వే తెలిపింది. వీరిలో సగం కంటే ఎక్కువమంది మూడంకెలతో కూడిన భాగాహారాలను (విభాజకం ఒకే అంకెలో ఉన్నప్పటికీ) చేయలేకపోతున్నారు.

- ✦ వీరిలో చాలామంది గడియారం చూసి సమయం కూడా చెప్పలేకపోతున్నారు. కేవలం గంటలను అయితే 83 శాతం మంది, నిముషాలతో సహా అయితే 60 శాతం మందే సరిగా చెప్పగలుగుతున్నారు.
- ✦ 76 శాతం మంది డబ్బులనూ సరిగా లెక్కపెట్టలేకపోతున్నారు. అయితే గణనలు చేయగలిగినవారిలో 90 శాతం మంది ఈ పనిని చక్కగా పూర్తిచేయగలుగుతున్నారు.
- ✦ 14 శాతం మంది ప్రపంచపటంలో భారత్‌ను గుర్తించలేకపోతున్నారు.
- ✦ 36 శాతం మంది దేశ రాజధాని పేరు చెప్పలేకపోతున్నారు.
- ✦ 21 శాతం మందికి వారి సొంత రాష్ట్రం పేరు తెలియదు.
- ✦ 58 శాతం మంది వారి రాష్ట్రాన్ని పటంలో గుర్తించలేకపోతున్నారు.

మాతృభాష (తెలుగు తదితర)లో మంచిర్యాల ముందున్నాయి. ప్రథమ స్థానంలో నిలిచిన జిల్లాల్లో సైతం 75 శాతం కంటే కచ్చితమైన జవాబులు గుర్తించినవారు ఒక శాతం లోపే ఉన్నారు. అత్యధికంగా 30–50 శాతం వారే ఉన్నారు.

విద్యార్థులు పై తరగతికి వెళ్లేకొద్దీ వారి అభ్యసన సామర్థ్యాలు పడిపోతున్నట్టు స్పష్టమవుతోంది. ఉదాహరణకు 8వ తరగతి గణితంలో 28.60 శాతం ప్రతిభతో చివరిస్థానంలో ఉన్న ఆదిలాబాద్ విద్యార్థులు 3వ తరగతిలో గణితం గణితం సబ్జెక్టులో 66.84 శాతం, 5వ తరగతిలో 53.38 శాతం కచ్చితమైన జవాబులు గుర్తించడం గమనార్హం. 8వ తరగతిలో

## ఒక్క శాతం యువతే వ్యవసాయం వైపు మొగ్గు

నేటి యువత వ్యవసాయాన్ని వృత్తిగా చేపట్టడానికి విముఖత చూపుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోని యువత కూడా వ్యవసాయం మినహా ఏదో ఓ రంగం వైపు మొగ్గు చూపుతోంది. ముఖ్యంగా ఏదో ఒక ఉద్యోగంలో చేరిపోవాలని కోరుకుంటోంది. అసర్ సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో కేవలం ఒక శాతం మందే వ్యవసాయాన్ని వృత్తిగా ఎంచుకుంటున్నారని సర్వేలో తేలింది. ఇక చాలామంది యువత సాంకేతికత వినియోగంలో వెనుకబడి ఉన్నారని వెల్లడైంది. 'బియాండ్ బేసిక్స్' పేరుతో అసర్ విడుదల చేసిన ఈ సర్వే కోసం.. దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాల్లోని 28 జిల్లాల పరిధిలో 14 నుంచి 18 ఏళ్ల వయసున్న 30,532 మంది గ్రామీణ యువతను ప్రశ్నించారు. బ్యాంకుల్లో నగదు జమ, ఉపసంహరణ వంటివి చేశామని 51 శాతం చెప్పగా, ఏటీఎం కార్డు ఉందని 16 శాతం తెలిపారు. ఇంటర్నెట్ బ్యాంకింగ్ తెలుసని చెప్పినవారు 5 శాతమే. 87 శాతం మంది టీవీ చూశామని, 63 శాతం మంది పేపర్ చదివామని, 47 శాతం మంది రేడియో విన్నామని చెప్పారు.

భవిష్యత్తులో ఏమి అవ్వాలనుకుంటున్నారన్న ప్రశ్నకు.. అబ్బాయిల్లో 18 శాతం మంది ఆర్మీ లేదా పోలీసు ఉద్యోగం చేయాలని, 12 శాతం మంది ఇంజినీర్లు కావాలని చెప్పగా, అమ్మాయిల్లో 25 శాతం మంది టీచర్, 18 శాతం మంది డాక్టర్/నర్స్ అవుతామని చెప్పారు. ఏదో ఒక ప్రభుత్వ ఉద్యోగం చేసుకుంటామని 13 శాతం అబ్బాయిలు, 9 శాతం మంది అమ్మాయిలు తెలిపారు. స్కూళ్లు, కాలేజీల్లో నమోదుకాని యువతలో 30 శాతం తాము ఏం కావాలనుకుంటున్నారో చెప్పలేకపోయారు. 40 శాతం మంది తమకు రోల్‌మోడల్స్ ఎవరూ లేరని చెప్పగా, కొందరు తల్లిదండ్రులే రోల్‌మోడల్ అని చెప్పారు.

కేవలం 39.40 శాతంతో గణితంలో ప్రథమ స్థానంలో నిలిచిన సిద్దిపేట విద్యార్థులు 3, 5లో 75.97, 62.54 శాతం ప్రతిభను చూపడం విశేషం. దాదాపు అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి.

హైదరాబాద్ శివార్లలోని రంగారెడ్డి జిల్లా పరిధిలోని 50 ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న మొత్తం 1207 మంది పిల్లలకు పరీక్షలు నిర్వహించారు. దాదాపు 53.84 శాతం మంది ప్రదర్శన పేలవంగా ఉంది. 1.16 శాతం మంది మాత్రమే 75 శాతం కంటే ఎక్కువ సమాధానాలు ఇచ్చి అగ్రశ్రేణిలో నిలిచారు.

- గణితంలో నిర్వహించిన పరీక్షల్లో 45.15 శాతం మందికి 30 శాతం కంటే తక్కువ మార్కులు వచ్చాయి. 75 శాతం కంటే ఎక్కువ మార్కులు వచ్చినవారు ఒక్కడే ఉన్నారు.
- సామాన్యశాస్త్రంలో 37.03 శాతం పిల్లలకు 30 శాతంలోపు మార్కులే వచ్చాయి. 75 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన పిల్లలు 9మంది ఉన్నారు.
- సాంఘిక శాస్త్రంలో 43.91 శాతం మంది 30 శాతం కంటే తక్కువ మార్కులే సాధించారు. 75 శాతం కంటే ఎక్కువ సమాధానాలు సరిగా ఇచ్చినవారు ఒక్కరు కూడా లేరు.

### ఏపీలో చిన్న లెక్కలూ చేయలేకపోతున్న 8వ తరగతి విద్యార్థులు, మాతృభాషలోనూ వెనుకంజ

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో గణితం, సాంఘిక, సామాన్య శాస్త్రాలతోపాటు మాతృభాషలోనూ విద్యార్థులు వెనుకబడుతున్నారు. మాతృభాషలోనే బోధన సాగుతున్నా పద్యాలు, పాఠ్యపుస్తకాలు, వార్తాపత్రికల్లోని శీర్షికలు, కథల పుస్తకాలను సక్రమంగా చదవలేనివారు భారీగానే ఉన్నారు.

రాష్ట్రంలో 2,205 పాఠశాలల్లోని 38,002 మంది విద్యార్థులు జాతీయ ఎచీవ్‌మెంట్ పరీక్షల్లో పాల్గొన్నారు.

- 8వ తరగతి తెలుగు భాషలో పశ్చిమ గోదావరి జిల్లా సరాసరిన 52.88 శాతంతో విద్యార్థుల ప్రతిభాసామర్థ్యాలు తక్కువగా ఉన్నాయి.
- అనంతపురం జిల్లాలో 60 పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతున్న 861 మందికి తెలుగు భాష పరీక్ష నిర్వహించగా చదవడం, రాయడం సక్రమంగా రానివారు సరాసరిన 35.47 శాతంగా ఉన్నారు. కథల పుస్తకాలు, పత్రికల్లోని వార్తలు, శీర్షికలు, ప్రకటనలను ఎవరి సహాయం లేకుండా చదవలేనివారు 62.93 శాతం ఉన్నారు. 8వ తరగతి చదువుతున్నవారిలో తెలుగుభాష సక్రమంగా రాయగలిగేవారు 57.32 శాతంగా మాత్రమే ఉన్నారు.
- చిత్తూరు జిల్లాలో మూడో తరగతి విద్యార్థులు 70.84 శాతం మంది పద్యాలు కూడా చదవలేకపోతున్నారు. కృష్ణాలో మూడో తరగతి విద్యార్థులు 82 శాతం మంది

## '3 ఆర్స్' సర్వే

చదవడం, రాయడం, లెక్కలు చేయడం (3 ఆర్స్) నేర్పించేందుకు తెలంగాణలోని ప్రభుత్వ బడుల్లో ప్రతి రోజూ మూడు పీరియడ్ల చొప్పున 60 రోజులపాటు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వాటి ఫలితాలను తెలుసుకునేందుకు ఇటీవల పాఠశాల విద్యాశాఖ బృందాలు రాష్ట్రంలోని 1,226 పాఠశాలలను పరిశీలించాయి. ఈ అధ్యయనంలో.. విద్యార్థుల్లో కనీస శక్తిసామర్థ్యాలు కూడా కొరవడుతున్నట్టు తేలింది. తెలుగులో ఒక పేరాను చదివి అర్థం చేసుకోగలిగేవారు, సొంతంగా రాయగలిగినవారు ప్రాథమిక పాఠశాలల్లో కేవలం 5-10 శాతం మాత్రమే ఉన్నారు. తెలుగు మీడియంలో ప్రాథమిక పాఠశాలల్లో గుణింతాల వరకు నేర్పించినా.. ఉన్నత పాఠశాలల్లో ఒత్తులు, పదాల వద్దే కార్యక్రమం ఆగిపోయింది. ప్రాథమిక స్థాయి పిల్లలు ఇంగ్లిష్ పదాలను చదవలేకపోతున్నారు. కార్యక్రమ నిబంధనల ప్రకారం.. గణితంలో గుణకారం, భాగహారం చేసేలా విద్యార్థులకు నేర్పించాలి. కానీ అది చేయలేకపోయారు. భాగాహారాలు చేయగలిగిన విద్యార్థులు 20 శాతానికి మించి లేరు.

- ✦ పిల్లలకు యాంత్రికంగా అభ్యాసం చేయించారు.
- ✦ పదాలను బోర్డులపై రాసి వల్లెవేయించటం, డిక్టేషన్ చెప్పటం వరకే పరిమితమయ్యారు.
- ✦ పుస్తకాలు, వార్తాపత్రికలు, బాలసాహిత్యం, కథావాచకాలు, అక్షరాలు, పదాలు, సంఖ్యలకు సంబంధించిన బోధన సామాగ్రిని ఉపయోగించలేదు.
- ✦ కార్యక్రమం జరిగే రోజుల్లో ఎంఈవోలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రాథమిక పాఠశాలలను సందర్శించినా.. పిల్లల పురోగతిని పరిశీలించలేదు.
- ✦ ఉన్నత పాఠశాలల్లో పర్యవేక్షణే లేదు.
- ✦ పాఠశాలల పరిశీలన సమయంలో టీచర్ల హాజరు గద్వాలలో 65 శాతం ఉంటే, కామారెడ్డిలో 67 శాతం ఉంది.
- ✦ ప్రాథమిక పాఠశాలల్లో రాష్ట్ర సగటు కంటే తక్కువ హాజరు శాతం హైదరాబాద్, రంగారెడ్డి, జనగాం, వికారాబాద్‌లలో నమోదైంది.
- ✦ ఉన్నత పాఠశాలల్లో తక్కువ హాజరు నమోదైన జిల్లాలు: వికారాబాద్, రంగారెడ్డి, గద్వాల, జనగాం, మెదక్, మంచిర్యాల.

పద్యాలు, బొమ్మలు వంటి వాటిని గుర్తించలేకపోయారు. శ్రీకాకుళం జిల్లాలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు పాఠ్యపుస్తకాలు చదవడంలో వెనుకబడ్డారు.

- ✦ 8వ తరగతి సాంఘికశాస్త్రంలో అనంతపురం జిల్లావ్యాప్తంగా 1,289 మందికి పరీక్ష నిర్వహించగా సరాసరిన ప్రతిభ చూపినవారు కేవలం 48.34 శాతం మాత్రమే.
- ✦ చిత్తూరు జిల్లాలో 8వ తరగతి సాంఘిక శాస్త్రానికి సంబంధించి 1,218 మందిలో సగటు సామర్థ్యం 42.39 శాతం. సామాన్యశాస్త్రంలో 40.09 శాతం, గణితంలో పెద్దసంఖ్యలతో గుణకారాలు, భాగహారాలు చేయలేనివారు 34.62 శాతం మంది ఉన్నారు.
- ✦ 8వ తరగతి సాంఘికశాస్త్రంలో ప్రతిభ కనబరిచినవారు తూర్పు గోదావరి జిల్లాలో 49.29 శాతం, గుంటూరు జిల్లాలో 49.57, కడప జిల్లాలో 49.92 శాతం. ఈ గణాంకాలు.. కడప జిల్లాలో సామాన్యశాస్త్రంలో 49.54 శాతం, గణితంలో 53.70 శాతం, కృష్ణా జిల్లా సామాన్యశాస్త్రంలో 45.16, గణితంలో 50.43 శాతం.
- ✦ కర్నూలు జిల్లాలో సాంఘిక, సామాన్య, గణిత శాస్త్రాలలో సామర్థ్యం సరాసరిన 43.58 శాతం, 43.81, 44.30 శాతం.
- ✦ ప్రకాశం జిల్లాలో 8వ తరగతి చదువుతున్న వారిలో కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగాహారాలు సక్రమంగా చేయలేనివారు 49.13 శాతంగా ఉన్నారు.
- ✦ శ్రీకాకుళం జిల్లాలో 8వ తరగతి సామాన్యశాస్త్రంలోని తూనికలు, కొలతలకు సంబంధించిన సరైన సమాధానాలు రాయలేనివారు 50.69 శాతం మంది.

### కొన్ని విషయాల్ని లైట్ తీసుకున్న ఎన్‌సీఈఆర్‌టీ సర్వే?

తమ ఇంటి నుంచి ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లిరావడం కష్టంగా ఉందని తెలుగు రాష్ట్రాల్లోని మూడవ తరగతి విద్యార్థుల్లో 31 శాతం మంది చెప్పినట్టు ఎన్‌సీఈఆర్‌టీ సర్వే తెలిపింది. అదేవిధంగా ఐదో తరగతిలో 28 శాతం, ఎనిమిదో తరగతిలో 30 శాతం విద్యార్థులు అభిప్రాయపడ్డారు. వాస్తవాల్లోకి వెళ్తే- ఉపాధ్యాయులు బోధించేవి అర్థమవుతున్నాయని 87 శాతం విద్యార్థులు చెప్పారనడం అంతగా అతకడం లేదు. రోజూ పాఠశాలకు వెళ్లి రావడమే కష్టంగా ఉంటోందని పలువురు విద్యార్థులు చెబుతుంటే, 95 శాతంపైగా పిల్లలు తరగతుల్ని ఇష్టపడుతున్నారనడం వాస్తవ దూరమేనని ఓ ప్రముఖ తెలుగు దినపత్రికలో రాసిన వ్యాసంలో విశ్లేషకులకరు అభిప్రాయపడ్డారు. "ఉపాధ్యాయుల అభిప్రాయాల్ని పరిశీలిస్తే- పాఠ్యప్రణాళికలపై పూర్తి అవగాహన ఉందని 71 శాతం అంటున్నారు. వృత్తి/ఉద్యోగం సంతృప్తిగా ఉందని 70 శాతం మంది, పనిభారం అధికంగా ఉందని 19 శాతం ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారంటున్నారు. శిక్షణ పొంది ఎంపిక పరీక్ష ద్వారా నియమితులైన ఉపాధ్యాయుల్లో 29 శాతం మందికి అసలు పాఠ్యప్రణాళికపైనే అవగాహన లేకపోవడం ఆశ్చర్యకరం. బడుల్లో సరిపడా తరగతి గదులు లేవని 86 శాతం, భవనాలకు మరమ్మతులు అవసరమని 28 శాతం, నీటిసమస్య లేదని 17 శాతం ఉపాధ్యాయులు అభిప్రాయపడినట్టు సర్వే చెబుతోంది. ప్రతి పాఠశాలలో క్రమం తప్పకుండా విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం జరగాలి. బాలల ఎదుగుదలకు వారి తల్లిదండ్రుల సహకారం తీసుకోవడం ప్రధానోపాధ్యాయుడి ముఖ్య విధి. ఈ సమావేశాలు రికార్డులకే పరిమితమవుతున్నాయి. అటువంటప్పుడు పాఠశాల కార్యక్రమాలకు తల్లిదండ్రుల ప్రోత్సాహం తక్కువగా ఉందని 17 శాతం ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారనడం ఆశ్చర్యం కలిగించే విషయం" అని ఆ కాలమిస్ట్ పేర్కొన్నారు.

✦ విశాఖపట్నం 8వ తరగతి సాంఘిక, సామాన్య, గణిత శాస్త్రాల్లో అన్నింటికీ సక్రమంగా సమాధానాలు చెప్పిన విద్యార్థులు 50 శాతం లోపే ఉన్నారు. విజయనగరం, పశ్చిమ గోదావరి జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ★

# ఆర్థిక సంఘానికి సలహామండలి

వివిధ అంశాల్లో సలహాలు, సూచనలు అందించడానికి 15వ ఆర్థికసంఘం సలహామండలిని ఏర్పాటు చేసుకుంది. రాష్ట్రాలకు కేంద్రపన్నుల్లో వాటా పంపిణీ కోసం 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకోవాలని, ప్రజాకర్షక విధానాలను, ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని, రాష్ట్రాలకు కేంద్ర పన్నుల్లో ప్రస్తుతం ఇస్తున్న 42 శాతం వాటాను సమీక్షించాలని కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘానికి నిర్దేశించిన విధివిధానాలపై దక్షిణాది రాష్ట్రాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ సలహామండలి ఏర్పాటుకావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ మండలిలో వివిధ సంస్థలకు చెందిన ఆరుగురు ఆర్థిక నిపుణులు సభ్యులుగా నియమితులయ్యారు.

అందులో 1. అరవింద్ వీర్‌మణి, ప్రెసిడెంటు, ఫోరం ఫర్ స్ట్రాటెజిక్ ఇనీషియేటివ్, 2. సుర్జీత్ ఎస్. భల్లా, ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలిలో తాత్కాలిక సభ్యుడు, ఆక్సస్ రీసెర్చి అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఛైర్మన్, 3. సంజీవ్ గుప్తా, ఐఎంఎఫ్ మాజీ డిప్యూటీ డైరెక్టర్, 4. పినాకి చక్రవర్తి, ప్రొఫెసర్ (ఎన్ఐపీఎఫ్‌పీ), 5. సజ్జద్ చినాయ్, చీఫ్ ఇండియా ఎకనామిస్ట్, జేపీ మోర్గాన్, 6. నీలకంఠ మిశ్రా, ఎండీ, క్రెడిట్ సుయెస్సె ఇండియా ఎకనామిస్ట్, స్ట్రాటజిస్ట్ ఉన్నారు. నిర్దేశించిన విధివిధానాలపై వీరు ఆర్థికసంఘానికి అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తారు. విభిన్న అంశాలపై పరిశోధన పత్రాలు రూపొందించి ఇస్తారు. విధివిధానాల్లోని ఏదైనా అంశంపై కమిషన్ లోతుగా అవగాహన చేసుకోవాలనుకున్నప్పుడు దానిపై పరిశోధనాత్మక అధ్యయనం చేసి నివేదిక రూపంలో సమర్పిస్తారు. నిధుల పంపిణీ విషయంలో దేశ, విదేశాల్లో అమలవుతున్న అత్యుత్తమ విధానాల గురించి కమిషన్ దృష్టికి తీసుకొస్తారు. కమిషన్ పరిధి, అవగాహన శక్తిని పెంచుకోవడానికి సహాయం చేస్తారు. కమిషన్ చేసే సిఫార్సులు నాణ్యంగా, సమర్థవంతంగా అమలుచేసే విధంగా తగు సలహాలు అందిస్తారు.

# లైసెన్స్ పర్మిట్ రాజ్ నుంచి 1991లో పరిశ్రమలు విముక్తమయ్యాయి, కానీ విద్యారంగానికి మాత్రం సంకెళ్లు పెరుగుతున్నాయి




- ప్రపంచంలోనే అతిఎక్కువమంది పిల్లలు ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్న దేశంగా భారతదేశం రికార్డు సృష్టించింది.
- పట్టణ ప్రాంతాల్లో చదివే పిల్లలో సగం మంది, గ్రామీణ ప్రాంతంలో మూడో వంతు మంది ప్రైవేటు స్కూళ్లలోనే చదువుతున్నారు. ఈ ఒరవడి వేగంగా విస్తరిస్తోంది.
- 2011-2015 మధ్యకాలంలో (విద్యాహక్కు చట్టం వచ్చాక) 1.1 కోట్ల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లటం మానేశారు. ప్రైవేటు స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య 1.6 కోట్లు పెరిగింది.
- అదేసమయంలో, కొత్తగా 11 రెట్లు దాకా (8,337 నుంచి 96,416కు) ప్రైవేటు పాఠశాలలు పెరిగాయి.
- ఇదే తీరు కొనసాగితే.. భారతదేశంలో ప్రభుత్వ పాఠశాలలు ఉపాధ్యాయులుతప్ప విద్యార్థులు లేకుండా పాడుపడినవిగా తయారవుతాయి. ఒక్క విద్యార్థి కూడా లేని ప్రభుత్వ స్కూళ్లు ఇప్పటికే 6,174 ఉన్నాయి.
- ఎందుకిలా జరుగుతోంది? ప్రభుత్వ పాఠశాలలు ఎందుకిలా తయారవుతున్నాయి? అంటే.. ప్రతి నలుగురు టీచర్లలో ఒకరు విధులకు దుమ్మా కొడుతున్నారు. పాఠశాలకు వచ్చిన ప్రతి ఇద్దరు ఉపాధ్యాయులలో ఒకరు పాఠాలు చెప్పడం లేదు.
- స్కూలుకెళ్లటం అంటే చదువు రావటం కాదని ప్రభుత్వ స్కూళ్లకు పిల్లల్ని పంపే నిస్సహాయ తల్లిదండ్రులకు అర్థమైంది. మధ్యతరగతి వాళ్లు ఒక తరం క్రితం నుంచే తమ పిల్లల్ని సర్కారీ బడులకు పంపటం మానేశారు. ఇప్పుడు పేదలు కూడా అదే పని చేస్తున్నారు. నెలకు రూ.417 ఫీజుతో ప్రైవేటు స్కూళ్లు అందుబాటులోకి రావడంతో పేదలు కొంత ఇబ్బందిపడైనా తమ పిల్లల్ని ప్రైవేటు బడులకు పంపుతున్నారు.
- ప్రైవేటు స్కూళ్లలో కూడా చదువు అంత మెరుగ్గా ఏమీ లేదు. కానీ కనీసం ఉపాధ్యాయులు బడికి వస్తారు, పాఠాలు చెప్పడానికి కష్టపడతారు. ఎందుకంటే, మార్కెట్లో ఇతర స్కూళ్లతో తమను తల్లిదండ్రులు పోల్చిచూస్తారనే భయం ప్రైవేటు పాఠశాలల వారికి ఉంటుంది.
- తమ ఇంటి ఖర్చులో 24 శాతాన్ని తల్లిదండ్రులు ప్రైవేటు స్కూళ్లలో ప్రాథమిక విద్యకు ఖర్చు పెడుతుండగా, 38 శాతాన్ని ప్రాథమికోన్నత విద్యకు వెచ్చిస్తున్నారు. ఇదే సమయంలో ప్రభుత్వ స్కూళ్లు ఉచితంగా బోధన, మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలను అందిస్తున్నాయి.
- ప్రైవేటు పాఠశాలలతో పోటీపడలేక.. సదుపాయాలు లేవు, వగైరా సాకులతో విద్యాహక్కు చట్టం ద్వారా 1,00,000 ప్రైవేటు స్కూళ్లను మూసివేయటానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయా స్కూళ్ల వర్గాలు వాపోతున్నారు. విద్యార్థులు నేర్చుకున్న విషయాల్ని పరీక్షించి, విద్యాప్రమాణాలు బాగాలేకపోతే స్కూళ్లను మూసివేయాలిగానీ, తప్పుడు కారణాలతో కాదని వారు వాదిస్తున్నారు.
- 1991లో పరిశ్రమలను లైసెన్స్-పర్మిట్ రాజ్ నుంచి విముక్తం చేశారుగానీ, విద్యావ్యవస్థను ఉన్నకొద్దీ సంకెళ్లతో బంధిస్తున్నారని ప్రైవేటు పాఠశాలలు ఆందోళనలు చేస్తున్నారు. రాష్ట్రాలవారీగా నిబంధనల్లో కొన్ని తేడాలున్నా..

ఇప్పటికీ ఒక స్కూలును ప్రారంభించాలంటే 35 నుంచి 45 అనుమతులు కావాలి. ఇందులో ప్రతిదానికీ లంచం తప్పనిసరి. కొన్ని రాష్ట్రాల్లో రూ.5 లక్షల వరకూ లంచాలిచ్చినవారున్నారు.

- అమెరికాలోని ఒక అత్యుత్తమ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నా మిత్రుడొకరు భారత్‌లో స్కూలు పెడదామని వచ్చారు. ఎన్నో ఆదర్శభావాలున్న వ్యక్తి ఆయన. ఇక్కడ లంచాలు, వేధింపులు చూశాక విసిగిపోయి తిరిగి అమెరికా వెళ్లిపోయారు.
- విద్యారంగంలో వైఫల్యాలు ఒక చోటుంటే, వాటిని సరిదిద్దడం చేతగాక రాజకీయనేతలు 'ఫీజుల నియంత్రణ'పై పడ్డారు. కానీ నెలకు రూ.2,500కు పైగా ఫీజులు వసూలు చేస్తున్న స్కూళ్లు కేవలం 3.6శాతం ఉండగా, రూ.1,000 పైన వసూలు చేసే పాఠశాలలు 18 శాతం మాత్రమే ఉన్నాయన్న విషయాన్ని వారు గుర్తించలేదు. ఇలా ఫీజుల నియంత్రణ వల్ల మెరుగైన ప్రైవేటు స్కూళ్లు మూతపడటమైనా జరుగుతుంది లేదా వారి కార్యక్రమాల్లో కోతైనా పడుతుంది.

– గురుచరణ్ దాస్

(పాఠశాల విద్యను ఉపాధ్యాయుల జీతాలో, ప్రభుత్వ–ప్రైవేటు వివాదం చుట్టూనో కాకుండా.. పూర్తిగా 'విద్యార్థులకు నాణ్యమైన చదువు' చుట్టూ తిప్పాలని, విద్యాప్రమాణాలను బట్టే మిగతావాటిని నిర్ణయించాలని చెబుతూ తల్లిదండ్రులపై భారం లేకుండా ప్రతి బిడ్డకూ నాణ్యమైన ప్రపంచ స్థాయి పాఠశాల విద్యనందించేందుకు లోక్‌సత్తా రూపొందించిన విధానాన్ని www.fdrindia.org లో చదవొచ్చు. దీన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా ఎఫ్‌డీఆర్ ప్రధాన కార్యదర్శి, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ అందించారు). ★

# పంచాయతీ పాలనను నిర్వీర్యం చేశారు, మూడంచెల ఫెడరలిజాన్ని సాధించుకోవాలి

స్థానిక పంచాయతీల పాలనను నిర్వీర్యం చేశారని లోక్‌సత్తా పార్టీ రాయదుర్గం నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటరమణబాబు అన్నారు. మండల పరిధిలోని టి.వీరాపురం గ్రామంలో రైతులతో సామూహిక సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, ఎంపీల పాలన జరుగుతోందని, 1960–70ల కాలంలో ఉన్నపాటి సామర్థ్యం కూడా ఇప్పుడు స్థానిక ప్రభుత్వాలకు లేకుండా చేశారని బాబు అన్నారు. కేంద్రం నేరుగా పంచాయతీలకు నిధులిస్తోందని ఆరోపిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. తన వాటాగా స్థానిక ప్రభుత్వాలకు ఎందుకు నిధులివ్వటం లేదో చెప్పాలన్నారు. జన్మభూమి కమిటీలతో పంచాయతీలను నిర్వీర్యం చేశారన్నారు. పంచాయతీలపై జన్మభూమి కమిటీలను వేసినట్టు కేంద్రప్రభుత్వం కూడా స్వచ్ఛభారత్ కమిటీలను రాష్ట్రం మీద వేస్తే ప్రభుత్వం ఊరుకుంటుందా? అని ప్రశ్నించారు. కేంద్రం–రాష్ట్రం–స్థానిక ప్రభుత్వాల మూడంచెల, మూడోదశ ఫెడరలిజం కోసం అందరూ సమాయత్తం కావాలన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా నేతలు గోపి, గంగప్ప, బుజ్జి, పెద్దసంఖ్యలో మహిళలు సహా గ్రామస్తులు పాల్గొన్నారు.






**వీఆర్‌వోల సమస్యలను పరిష్కరించాలి**

గ్రామాల్లో ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తూ పరిష్కరించటానికి కృషి చేస్తున్న వీఆర్‌వోల సమస్యల్ని పరిష్కరించాలని బాబు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 9,860 మంది వీఆర్‌వోలు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తోందన్నారు. వీఆర్‌వోల నిరసనకు ఆయన మద్దతు తెలిపారు. ★

# ఇంత తపన పడే తల్లిదండ్రులు చాలాదేశాల్లో కనిపించరు, అయినా ఎక్కడా లేనంత అధ్వాన్నంగా మన చదువులు!




**ప్రాథమిక విద్య మాతృభాషలోనే సాగాలి**

విద్యార్థులకు ప్రాథమిక విద్య మాతృభాష లోనే జరగాలని జేపీ అన్నారు. అప్పుడే మంచి పునాది పడి వారు బాగా చదవటంతోపాటు అన్ని భాషలనూ సులభంగా అర్థం చేసుకో గలుగుతారన్నారు.

**పేదరికం వల్లే ఆడపిల్లల్ని ప్రభుత్వ స్కూళ్లకు పంపుతున్నారు**

గతంతో పోలిస్తే బాలికల విద్య పట్ల సమాజంలో చైతన్యం పెరిగిందని, అయితే పేదరికం వల్లే ఎక్కువమంది ఆడపిల్లల్ని ప్రభుత్వ స్కూళ్లకు పంపుతున్నారని ఓ ప్రశ్నకు సమాధానంగా జేపీ చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చదివించటానికి తల్లిదండ్రులకు ఆత్మన్యూనత అక్కర్లేదని, అక్కడ సరైన చదువు అందేలా చేయటానికి ప్రయత్నం చేయాలని జేపీ అన్నారు. తనలాంటి అనేకమంది ప్రభుత్వ స్కూళ్లలో చదువుకునే ఎదిగామన్నారు. ఏపీలో ప్రతి విద్యార్థి మీదా ఏడాదికి రూ. 60,000 ప్రభుత్వం ఖర్చు చేస్తున్నా సరైన చదువు రావటం లేదని, కాస్త మెరుగ్గా ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో వార్షిక ఫీజు కూడా రూ. 60వేలు లేదని అన్నారు. ఎందుకు డబ్బు ఖర్చు చేస్తున్నా పిల్లలకు చదువు రావటంలేదో తల్లి దండ్రులు, సమాజం, ఉపాధ్యాయులు, రాజకీయ వ్యవస్థ ఆలోచించాలన్నారు.

గుంటూరు జిల్లా బాపట్లలోని ఏపీ మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో యాజలి జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం, లయన్స్ క్లబ్, రక్షణ సైన్యం, రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సురాజ్య యాత్ర కార్యక్రమంలో జేపీ మాట్లాడారు.

**కష్టపడి పనిచేసే ఉపాధ్యాయులకు గుర్తింపు, తప్పు చేసినవారిపై వెంటనే చర్యలు ఉండాలి**

తల్లిదండ్రులుగా ఉపాధ్యాయులు కూడా తమ పిల్లల్ని మంచి ప్రమాణాలున్న పాఠశాలలోనే చేర్పించాలనుకుంటున్నారని జేపీ అన్నారు. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయాలనటానికి ఇంతకంటే ఎక్కువ సాక్ష్యం అక్కర్లేదన్నారు. విద్యాబోధన ఉపాధ్యాయుల జీతాల చుట్టూ కాకుండా.. విద్యార్థులలో పెంపొందే ప్రమాణాల చుట్టూ తిరగాలన్నారు. ఇందుకోసం కష్టపడి పనిచేసే టీచర్లకు గుర్తింపు, పనిచేయనివారిపై చర్యలు వెంటనే ఉండాలన్నారు.

నేటి పిల్లల్లో చురుకుదనం, కష్టపడే తత్వం ఎక్కువగా ఉన్నాయని, అవి వికసించి ఫలితాలనిచ్చే విద్యను అందించటంలో పెద్దలే విఫలమవు తున్నారని, ఈ అతి పెద్ద తప్పిదాన్ని వేగంగా సరిచేసుకోవాలని జేపీ అన్నారు. పిల్లలకు మంచి చదువు అందాలని తల్లిదండ్రులు మనదేశంలో చేస్తున్నన్ని త్యాగాల్ని ప్రపంచంలో చాలా తక్కువ దేశాల్లో చేస్తారని, కానీ

**ఆంగ్లంలో పట్టు రాకపోవడానికి కారణం కూడా విద్యాప్రమాణాలు లేకపోవడమే**

ఆంగ్ల మాధ్యమంలో చదివినా ఉన్నత పాఠశాల స్థాయిలో కూడా ఆంగ్లంలో, ఇతర అంశాల్లో విద్యార్థులకు పట్టురాకపోవడానికి విద్యాప్రమాణాలు లేకపోవడమే కారణమని జేపీ అన్నారు.

చదువులు చాలా దేశాల్లోకంటే మనదేశంలోనే అధ్వాన్నంగా ఉన్నాయని అన్నారు. 74 దేశాల్లో సర్వే చేస్తే మనదేశం 73వ స్థానంలో ఉందన్నారు. ఈ వైరుధ్యం ఎందుకుందో మనం అర్థం మొదట అర్థం చేసుకోవాలన్నారు. విద్యలో నక్సెన్‌కి నిర్వచనాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యా సంస్థలు, సమాజం, మీడియా, ప్రభుత్వాలు మార్చాలన్నారు. విద్యకు అర్థమేమిటో తెలుసుకుంటే, మార్కుల్ని ర్యాంకుల్ని దాటి పిల్లలకు మంచి చదువు వచ్చేలా చేసుకోగలమన్నారు. అలాగే విద్యనందించటం ఎప్పటి కప్పుడు బేరీజు వేసుకుంటూ సరిచూసుకుంటూండాల్సిన సంక్లిష్ట ప్రక్రియని గుర్తించి, ఇందు కోసం సంస్థాగత ఏర్పాట్లు చేసుకోవా లన్నారు. ఇందుకోసమే సురాజ్య యాత్ర అన్నారు.

ఏపీ హెచ్ఆర్‌డీ డీజీ డి.చక్రపాణి, పారిశ్రామికవేత్త చినబాబు, లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సత్యనారాయణ, శ్రీనివాసరావు, కోశాధికారి సుధాకర్ గుప్తా, వివేక సర్వీస్ సొసైటీ కార్యదర్శి అంబటి మురళీకృష్ణ, లోక్‌సత్తా 2.0 ఉద్యమ సంస్థ ఏపీ, తెలంగాణ కన్వీనర్ బండారు రామ్మోహనరావు, లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, సురాజ్య ఉద్యమ జిల్లా కన్వీనర్ మాదాసు భానుప్రసాద్, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ నేతలు కొత్త సూర్య, కొణిశెట్టి దుర్గాదేవి, జేబీ సురేష్, మోదుగు శ్రీనాథ్‌రెడ్డి, లక్ష్మీనరసింహ, వైబీఐ నేతలు శివరామకృష్ణ, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు. ★

# డ్రైవర్ల పొట్టకొట్టొద్దు



ప్రభుత్వం వాహనాలకు చెల్లించే అద్దెను పెంచటంతో కొంతమంది అధికారులు తమ సొంత వాహనాలను బినామీ పేర్లతో తిప్పుతున్నారని, దీనివల్ల పదేళ్లుగా ప్రభుత్వానికి వాహన సేవలందిస్తున్న డ్రైవర్ల ఉపాధి దెబ్బతింటోందని భీశెట్టి బాబ్జీ విజయనగరం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లాకు చెందిన అద్దె వాహనాల యజమానులు, డ్రైవర్లు కూడా ఆయన వెంట ఉన్నారు. ప్రభుత్వం వెంటనే బిల్లుల్ని చెల్లించినా చెల్లించకపోయినా, డీజిల్ ధరలు అమాంతం పెరిగినా పలువురు డ్రైవర్లు సేవలందిస్తూ వచ్చారని బాబ్జీ గుర్తుచేశారు. ఒక్క నెల జీతం లేకపోతే అల్లాడిపోయే అధికారులు సామాన్యుల ఉపాధి గురించి మాత్రం పట్టించుకోవటం లేదన్నారు. దీనిపై విచారణ చేపట్టి డ్రైవర్లకు న్యాయం చేయకపోతే ఆందోళన చేపట్టాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకుంటామని అదనపు జాయింట్ కలెక్టర్ హామీ ఇచ్చారు. కె.ఎ రాము, చంద్రమోహన్, రమేష్, రమణ, ఉమా, సంతోష్, శ్రీను, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు. ★

# రైతు ఆదాయంపై లెక్కలు కరువు




రైతుకు ఆదాయం ఎంత వస్తోంది, వార్షిక వృద్ధి రేటు ఏ స్థాయిలో ఉంటోందీ.. కచ్చితంగా చెప్పడానికి మనదేశంలో శాస్త్రీయ గణన విధానం లేదని 'రైతుల ఆదాయం రెట్టింపు కమిటీ' పేర్కొంది. 2022-23 నాటికి దేశంలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి ఏం చేయాలో చెప్పమని కోరుతూ అశోక్ దళవాయి నేతృత్వంలో ఈ కమిటీని గతంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 13 విభాగాలుగా నివేదికను రూపొందించింది. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడానికి చేయాల్సిన 'క్షేత్రస్థాయి సంస్కరణలు, పరిపాలనా వ్యవస్థ నిర్మాణం' అనే అంశంపై 13వ భాగాన్ని ఇటీవల విడుదల చేసింది. రైతుల సమస్యలపై ఇందులో సూచనలిచ్చింది.

ఆదాయ అంచనాకు పటిష్ట విధానం అవసరం

రైతుల ఆదాయాన్ని అంచనా వేయడానికి కేంద్రం ప్రస్తుతం రెండు విధానాలను అనుసరిస్తోంది. ఒకటి.. జాతీయ వ్యవసాయ వ్యయ, ధరల కమిషన్ (సీఏసీపీ) నివేదికలోని వివరాలు, రెండు.. జాతీయ నమూనా సర్వే (ఎన్ఎస్ఎస్ఓ) లెక్కలు. ఎన్ఎస్ఎస్ఓ 2002-03లో నిర్వహించిన 59వ జాతీయ సర్వే ప్రకారం రైతు కుటుంబం సగటు ఆదాయం రూ.25,380. 2012-13లో నిర్వహించిన 70వ సర్వే ప్రకారం రూ.77,112గా తేలింది. రెండింటినీ పోలిస్తే వార్షిక సగటు వృద్ధి రేటు 11.75 శాతం ఉన్నట్టు సర్వే వివరిస్తోంది. ఇదే దశాబ్దకాలంలో ద్రవ్యోల్బణ పెరుగుదలను పరిగణలోకి తీసుకుంటే ఆదాయ వాస్తవ వృద్ధి రేటు 5.24 శాతమేనని కమిటీ పేర్కొంది. జాతీయ వ్యవసాయ, ఆర్థిక విధానం (ఎన్ఐఏపీ) ప్రకారం.. వ్యవసాయం, ఇతర వృత్తులను పోల్చుతూ జాతీయ సగటును లెక్కించాలి. రైతుల్లోనే వివిధ వర్గాల మధ్య పెరుగుతున్న ఆదాయాన్ని పరిగణలోకి తీసుకోవాలి. పంచాయతీ, తాలూకా (మండలం), జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి వరకూ సమాచార సేకరణకు పటిష్ట విధానముండాలి.

- పంటలకు గిట్టుబాటు ధర ఇప్పించే వ్యవస్థలు నిర్మాణాత్మకంగా లేవు. మార్కెటింగ్ శాఖ పరిధిలో సాధారణ గోదాములు, మార్కెట్ యార్డులు.. కేంద్ర ఉద్యానశాఖ పరిధిలో శీతల గిడ్డంగుల రాయితీలు, నిర్మాణాలు ఉన్నాయి. గిట్టుబాటు ధర విషయంలో ఇలా విడివిడిగా ఉండే వ్యవస్థల మధ్య కేంద్రీకృత సమన్వయం కొరవడింది.
- మార్కెటింగ్ శాఖను 'వ్యవసాయ మార్కెటింగ్, వ్యవసాయ సరకు రవాణాశాఖ'గా మార్చాలి.
- వ్యవసాయ, ఉద్యాన శాఖలు.. పంటల శుద్ధి రంగాన్ని చేపట్టి వాటికి విలువ పెరిగేలా చూడాలి.
- వ్యవసాయ రంగంలోకి 'ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యం' కింద పెట్టుబడులు పెరగాలి.
- వ్యవసాయభివృద్ధికి గ్రామస్థాయిలో కార్యాచరణ ప్రణాళికను పంచాయతీయే రూపొందించాలి.
- గ్రామ పంచాయతీ స్థాయి రైతులు సేద్యంపై

## మద్దతు ధర మెలికలు

అన్ని రాష్ట్రాల నుంచి సాగుకు సంబంధించిన వివరాలు తీసుకుని జాతీయ సగటు ఆధారంగా ప్రస్తుతం ధర నిర్ణయిస్తున్నారు. దీనివల్ల సాగు ఖర్చు ఎక్కువగా ఉండే రాష్ట్రాలకు నష్టం జరుగుతుంది.

ఉదాహరణకు 2017లో క్వింటా వరి సాగుకు రూ.2,158 ఖర్చవుతుందని, దీనికి యాభై శాతం కలిపి రూ.3,237 కనీస మద్దతు ధరగా నిర్ణయించాలని తెలంగాణ కోరింది. కేంద్ర కమిటీ మాత్రం సాగు వ్యయం, కుటుంబ శ్రమకు కలిపి క్వింటాకు రూ.1,117 మాత్రమే ఖర్చవుతుందని తేల్చింది. వరి పండించే అన్ని రాష్ట్రాలను లెక్కలోకి తీసుకుని ఈ నిర్ణయానికి వచ్చింది. కౌలు, సొంత పెట్టుబడి వడ్డీ కలిపితే క్వింటాకు రూ.1,484 అవుతుందని అంచనాకు వచ్చింది. చివరకు క్వింటా ధర రూ.1,550గా నిర్ణయించింది. దీని ప్రకారం సాగు ఖర్చు, కుటుంబ శ్రమకు క్వింటాకైన ఖర్చు కంటే 38.76 అదనంగా కనీస మద్దతు ధరను నిర్ణయించినట్టు కమిటీ పేర్కొంది.

2017–18లో ధరల నిర్ణయ సమయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి అన్ని ప్రధాన పంటలు, ఒడిషా నుంచి వరి, బీహార్ నుంచి వరి, మొక్కజన్న.. పంజాబ్ నుంచి వరి, పత్తి పంటలను పరిగణలోకి తీసుకొంది. ఏపీ పేర్కొన్న ఖర్చుకు, కమిటీ తీసుకొన్న ఖర్చుకు వ్యత్యాసం ఉండటానికి కారణం దిగుబడి తక్కువగా పేర్కొనడమేనని కమిటీ వ్యాఖ్యానించింది. పత్తిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తక్కువ దిగుబడి ఉన్నట్టు పేర్కొనడంతోపాటు సాగు ఖర్చులను ఎక్కువగా చూపించినట్టు కమిటీ అభిప్రాయపడింది.

పంట ఉత్పత్తికి తాము చేసిన సమగ్ర వ్యయం (సీ2)కన్నా 50 శాతం ఎక్కువ ధర లభించాలని రైతులు ఆశిస్తారు. భూమి కౌలు విలువ, కార్యనిర్వాహక మూలధనంపై వడ్డీతో సహా పంట ఉత్పత్తికి అయిన వ్యయాన్ని సీ2గా వ్యవహరిస్తారు. కానీ ప్రభుత్వం ఏ2 (వాస్తవంగా చేసిన ఖర్చు)కు కుటుంబ సభ్యుల శ్రమ (ఎఫ్ ఎల్) విలువను కలిపిన మీదట లెక్కతేలే మొత్తంపై (ఏ2 ప్లస్ ఎఫ్ ఎల్) మాత్రమే 50 శాతం ఎక్కువ ధర చెల్లిస్తామంటోంది. ఏ2 ప్లస్ ఎఫ్ ఎల్‌లో భూమి కౌలు విలువను, వడ్డీని కలపరు. దీనివల్ల చాలా తేడా వస్తుంది. ఉదాహరణకు 2017–18లో ఏ2 ప్లస్ ఎఫ్ ఎల్ వ్యయం కన్నా 39 శాతం ఎక్కువ ధరను వరికి కనీస మద్దతు ధరగా నిర్ణయించారు. కానీ, అదే సంవత్సరం వరి మద్దతు ధర సీ2 కన్నా కేవలం నాలుగు శాతమే ఎక్కువ. ఏతావాతా ఏ2 ప్లస్ ఎఫ్ ఎల్‌ను అనుసరిస్తే వరి కనీస మద్దతు ధర కేవలం 11 శాతం పెరుగుతుంది. సీ2 కన్నా 50 శాతం ఎక్కువ ధరను నిర్ణయిస్తే అది 46 శాతం పెరుగుతుంది. స్వామినాథన్ నేతృత్వంలోని జాతీయ రైతు సంక్షేమ కమిషన్ సూచించినట్టు సీ2పై 50 శాతం ధర ఇస్తామనే ఎన్నికల్లో బీజేపీ వాగ్దానం చేసింది.

నిర్ణయాలు తీసుకోవడంలో భాగస్వాము లవ్వాలి. పంచాయతీలకు వీడియో కాన్ఫరెన్స్ వంటి సదుపాయాలుండాలి.

- ✦ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వ్యవస్థను కర్షకులు ఎక్కువగా వినియోగించుకునేలా చూడాలి.
- ✦ రైతుల ఉత్పత్తుల కంపెనీ (ఎఫ్‌పీవో)లు పెద్దసంస్థలతో అనుసంధానమై వారి ప్రయోజనాలు కాపాడేందుకు ముందుకు రావాలి.
- ✦ వ్యవసాయ వాణిజ్యాన్ని ప్రోత్సహించేందుకు భూములను కౌలుకు ఇచ్చే చట్టం తేవాలి. ఎక్కువ భూమిని ఒకే కమతంగా సాగుచేసే ల్యాండ్ పూలింగ్ విధానం తేవాలి.
- ✦ భూముల సాగుకు లైసెన్స్ ఇచ్చేలా చట్టం చేయాలి.
- ✦ కాంట్రాక్టు వ్యవసాయ చట్టం ద్వారా సాగును, ఎఫ్‌పీవోల ఏర్పాటును ప్రోత్సహించాలి.
- ✦ రాష్ట్రాలన్నీ మోడల్ మార్కెటింగ్ చట్టాన్ని అనుసరించాలి.
- ✦ ప్రాథమిక గ్రామీణ చిల్లర మార్కెట్ల సామర్థ్యాన్ని పెంచాలి.
- ✦ 'ఎలక్ట్రానిక్ జాతీయ వ్యవసాయ మార్కెట్'ను పటిష్టపరిచి ఆన్‌లైన్ ద్వారా పంటల కొనుగోలు పెంచాలి.
- ✦ పంటలకు మద్దతు ధర పథకాన్ని తెచ్చి, వాటిని ఎక్కడికక్కడ కొనేలా వికేంద్రీకరణ విధానం అనుసరించాలి.
- ✦ ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు సకాలంలో సరైన ధరకు రైతుకు లభించేలా చట్టాలు చేయాలి. ★

# రైతులకు, వినియోగదారులకు నష్టం చేసే దిక్కుమాలిన ఆలోచనలొద్దు: లోక్‌సత్తా దీక్షకు పలు పార్టీల మద్దతు











విజయనగరం ఆర్ అండ్ బీ రైతుబజారుకి జిల్లాలోనే మంచిపేరుందని, రైతులు-వినియోగదారులకు న్యాయమైన లావాదేవీలు ఇక్కడ జరుగుతున్నాయని, ఇటువంటి రైతుబజారులో రైతులకు ఇబ్బంది కలిగించే చర్యలు చేపట్టవద్దని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు విజ్ఞప్తి చేశారు. రోడ్డు విస్తరణ పేరుతో రైతుబజారును తొలగించాలని చూస్తే అధికార పార్టీ నేతలు తీవ్ర మూల్యం చెల్లించుకోవాల్సుంటుందన్నారు. రైతుబజారుకు నష్టంకలగకుండానే రోడ్డును నిర్మించవచ్చని స్పష్టం చేశారు. రైతుబజారుకు అన్యాయం చేయవద్దని డిమాండ్ చేస్తూ పట్టణంలో వినియోగదారులు, రైతులతో కలిసి బాబ్జీ నిరసన దీక్ష నిర్వహించారు. పలు పార్టీల నేతలు లోక్‌సత్తా దీక్షకి సంఘీభావం ప్రకటించారు. అన్ని పార్టీల తరపునా సమస్యను మరోమారు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తామని బాబ్జీ ఈ సందర్భంగా తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.కామేశ్వరరావు, వైకాపా ఎమ్మెల్సీ కోలగట్ల వీరభద్రస్వామి, ఆ పార్టీ జిల్లా వ్యవహారాల కన్వీనర్ మజ్జి శ్రీనివాసరావు, బీజేపీ నేత అచ్చిరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాసరావు, రైతునేతలు ఎర్నినాయుడు, లక్ష్మి, సత్యనారాయణ, రమణమ్మ, గౌరి, నాయుడు, నాగభూషణం, రమణ తదితరులు పాల్గన్నారు.

కాగా, కొన్ని రోజుల క్రితం రైతుబజారును సందర్శించి సమస్యల్ని తెలుసుకుంటున్నప్పుడు.. రైతుబజారు తొలగింపు గురించి బాబ్జీకి మహిళారైతులు చెప్పి ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు వెడల్పు పేరుతో రైతుబజారును తొలగించాలని పాలకులు చూస్తున్నారని, అదే జరిగితే తమ కుటుంబాలు వీధిన పడతాయన్నారు. రోజుకి 4వేల మంది వినియోగదారులకు తాము సేవలందిస్తున్నామన్నారు. ఆ సమయంలో కొనుగోళ్లకు వచ్చిన పలువురు వినియోగదారులు కూడా రైతుల పక్షాన మాట్లాడారు. ఆ తర్వాత మునిసిపల్ కమిషనర్, ఛైర్మన్‌లను బాబ్జీ కలిసి సమస్యను వివరించారు. రైతుబజారుకు ఇబ్బంది లేకుండా రోడ్డు వేయమని కోరారు. జాప్యం కొనసాగుతుండటంతో నిరసన దీక్షను చేపట్టారు. ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధుల దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్తామని, రైతులు, వినియోగదారుల ప్రయోజనాల్ని పరిరక్షిస్తామని బాబ్జీ స్పష్టంచేశారు. ★

# ప్రతిభ ఉన్నది 80 మార్కులు తెచ్చుకున్న ఆ పిల్లకా? 82 మార్కులు తెచ్చుకున్న పట్టణ ప్రాంత పిల్లాడికా?



"మేం కష్టపడి మార్కులు తెచ్చుకుంటున్నాం. కానీ రిజర్వేషన్ల పేరుతో మాకంటే తక్కువ మార్కులు వచ్చినవారికి సీట్లు, ఉద్యోగాలు ఇస్తున్నారు. ఇదెంత అన్యాయం సార్!"

"ఒక ఊళ్లో చదువులేని తల్లిదండ్రుల కుమార్తె కష్టపడి ఓ మామూలు స్కూల్లో చదువుకుని నూటికి 80 మార్కులు సాధించిందనుకుందాం. మరో పట్టణంలో కాస్త డబ్బు, చదువు ఉన్న తల్లిదండ్రుల కొడుకు 82 మార్కులు సాధించాడనుకుందాం. అతనికి మంచి స్కూలు, అదనంగా ట్యూషన్ కూడా ఉంది. నీ వాదన ప్రకారం 82 మార్కులు వచ్చిన పిల్లాడికే సీటు రావాలి. కానీ నువ్వే చెప్పు.. ఇద్దరిలో నిజంగా తెలివి ప్రదర్శన, అర్హత ఉన్నది ఎవరికి? మంచి స్కూలు, తల్లిదండ్రులకు చదువులేని ఆ పల్లెటూరి పేదపిల్లకు ఎక్కువ ప్రతిభ ఉందా? పట్టణంలో రెండు మార్కులు ఎక్కువ తెచ్చుకున్న డబ్బున్న పిల్లాడికి ఎక్కువ ప్రతిభ ఉందా?"

"ఆ పిల్లకే ఎక్కువ సామర్థ్యం ఉంది సార్!"

"అందుకే రిజర్వేషన్లు!.. అవి లేకుంటే ఆ పిల్లకు వెంటనే న్యాయం ఎలా చేయగలం? కులం పేరుతో శతాబ్దాలపాటు అమానుషంగా అమలుచేసిన వివక్ష వల్ల ఈ దేశంలో అనేకమంది బిడ్డలు అవకాశాలు కోల్పోయారు, కోల్పోతున్నారు. వారికి కనీసం అండగా నిలిచేందుకు రిజర్వేషన్లు అవసరం. అయితే ఒకసారి రిజర్వేషన్లు పొంది పైస్థాయికి ఎదిగినవారికి వీటిని ఇవ్వకూడదు. కలెక్టర్ కొడుకు, మంత్రి కూతురు వంటివారికి రిజర్వేషన్లు ఇస్తే, అణగారిన కులాల్లో దిగువన ఉన్న అనేకమందికి అవకాశాలు రావు. అలాగే కేవలం కులం కారణంగానే కాకుండా పేదరికం కారణంగా కూడా అవకాశాలు కోల్పోతున్నవారు మనదేశంలో కోకొల్లలుగా ఉన్నారు. ఇలాంటివారికి రిజర్వేషన్ తరహాలో అదనపు మార్కుల్ని కొద్దిగా కలిపే ఏర్పాటు చేయాలి. ఇలా చేస్తూనే అందరికీ మంచి విద్యను అందించే ఏర్పాటు చేస్తే.. కొన్నేళ్లలో మీరు ఇస్తానన్నా ఎవరూ రిజర్వేషన్ తీసుకోరు. వాటి అవసరం ఉండదు. ఇవన్నీ చెప్పటానికే, పరిష్కారాలు సాధించడానికే సురాజ్య యాత్ర చేస్తున్నాం."

.. ఇది జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో ప్రకాశం జిల్లా పెద్దదోర్నాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జయప్రకాష్ నారాయణ్‌కి, ఓ విద్యార్థినికీ మధ్య సాగిన సంభాషణ.

మంచి విద్య లేకపోతే విద్యార్థుల భవిష్యత్తు, దేశ భవిష్యత్తు కూడా ఇబ్బందుల్లో పడతాయని జేపీ అన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాలను ఏర్పరచుకుని చదవాలన్నారు. అన్ని రంగాలపై అభిరుచిని పెంచుకుని చదవాలన్నారు. ఇష్టపూర్వకంగా చదివి పరిజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. విద్యతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొనాలన్నారు. అవినీతిపరులు పెరిగిపోతున్నారు, సరిగా వసతులు లేవు, ఇతరులు మన అవకాశాల్ని తన్నుకు పోతున్నారు అని గగ్గోలు పెట్టి లాభం లేదని, అందరికీ ఎదిగే అవకాశాల కోసం పద్ధతుల్ని తెలుసుకుని ఒడుపుగా సాధించుకోవటం నేర్చుకోవాలన్నారు. స్థానికంగా ప్రజలకు హక్కుగా సేవలందించే వ్యవస్థను నిర్మించకపోవడం వల్ల ప్రతి పనికీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు వంటి వారి మీద ఆధారపడాల్సిన పరిస్థితి వస్తోందని, సరైన చదువు లేకపోవడం వల్ల ఇది మరీ జటిలంగా మారి ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రవహించటానికి కారణమవుతోందని అన్నారు. రోజుకు ప్రభుత్వాలు రూ. 11,000కోట్లు ఖర్చు చేస్తున్నా జనాలకు పనులు జరగటం లేదన్నారు. చాలా చిన్న ప్రయత్నంతో వీటన్నిటినీ మార్చవచ్చని, జనం జీవితాల్లో మాత్రం పెద్ద ప్రభావాన్ని చూపవచ్చని, సురాజ్య యాత్ర లక్ష్యమిదేనని వివరించారు. అవినీతిని అరికట్టటానికి దిగువన పౌర సేవల చట్టం, పైస్థాయిలో స్వతంత్ర విచారణ, అవినీతిపరుల ఆస్తుల జప్తునకు చట్టం వస్తే చాలా వరకూ మార్పు కనిపిస్తుందన్నారు. యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో నమోదై సామాజిక మార్పులో భాగస్వాములు కావాలని సూచించారు.

బండారు రామ్మోహనరావు, శివరమేష్‌రెడ్డి, ప్రజా సైన్స్ వేదిక రాష్ట్ర నేతలు సీఏ ప్రసాద్, అబ్దుల్ కలాం, ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ★

# హక్కుగా జరగాల్సిన పనులకు లంచం ఇస్తుంటే.. అది ప్రజాస్వామ్యమవుతుందా?

రాష్ట్రంలో, దేశంలో లంచం లేనిదే పనులు జరగటం లేదని, ప్రజలు తమకు హక్కుగా జరగాల్సిన పనులకు లంచం ఇస్తుంటే దాన్ని ప్రజాస్వామ్యం అంటారా? అని జేపీ ప్రశ్నించారు.

సురాజ్య యాత్రలో భాగంగా కడపలో పర్యటించిన జేపీ.. వివిధ వర్గాల ప్రజలను కలుసుకున్నారు.

''రాష్ట్రంలో ఎక్కడైనా చట్టబద్ధపాలన సక్రమంగా ఉందా?

ప్రభుత్వ కార్యాలయంలో లంచం ఇవ్వకుండా ఎంతమంది పనిచేయించుకోగలుగుతున్నారు? ప్రభుత్వోద్యోగం చేసి రిటైరైనవాళ్ల నుంచి లంచాలు గుంజుతున్నారు. ఇంత దారుణమైన వ్యవస్థను నడుపుతూ పైకి మాత్రం గొప్ప ప్రజాస్వామ్య మన్నట్టు పాలకులు నటిస్తున్నారు'' అని జేపీ ధ్వజమెత్తారు. దీనిపై ప్రజలను స్పందింప చేసేందుకు, పరిష్కారాల్లో భాగం చేసేందుకే సురాజ్య యాత్రను చేపట్టామన్నారు.

రాజకీయాలంటే పవిత్ర వ్యాసంగమని, యువత రాజకీయాలను పట్టించుకోవాలని తొలి నుంచీ తాను వాదిస్తున్నానని, ఇప్పటికీ దానికి కట్టుబడి ఉన్నానని జేపీ అన్నారు. అయితే డబ్బు చుట్టూ, అవినీతి చుట్టూ తిరుగుతున్న ఎన్నికల రాజకీయాల వలలో యువత చిక్కుకోకూడదని కోరుతున్నానన్నారు. యువత సామాజిక రాజకీయం చేయాలని, చుట్టూ ఉన్న సమాజం లోని సమస్యలను పట్టించుకుంటూ చిన్న కార్యక్రమాల ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ మార్పులను సాధించాలని అన్నారు. సరైన అవగాహన ఉంటే పరిమిత వనరుల్లోనే ఇది పూర్తిగా సాధ్యమన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొత్తగా



భూధార్ కార్యక్రమాన్ని తీసుకొచ్చారని, కానీ సర్వే సక్రమంగా లేకుండా ఎంత హడావుడి చేసినా గందరగోళం, కబ్జాలు పోవన్నారు. ఎప్పుడో బ్రిటిష్ కాలంలో చేసిన సర్వే మినహా మనకు సర్వే లేదని జేపీ అన్నారు. స్వతంత్రం వచ్చి 70 సంవత్సరాలవుతున్నా ఇంతవరకు రాష్ట్రంలో భూసర్వే సెటిల్‌మెంట్ చేయలేదని, భూమి ఎవరి పేరున ఉందో స్పష్టంగా తెలియకుండానే రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వాలు ముందు సర్వే సెటిల్‌మెంట్ చేయాలన్నారు.

రాష్ట్రంలో ప్రభుత్వం డిజిటల్ క్లాస్‌రూం విధానాన్ని ప్రవేశపెట్టటం స్వాగతించదగ్గదే అయినా, ఇప్పటికే ఖర్చు చేస్తున్న వేలకోట్ల రూపాయల వల్ల ఎందుకు చదువు సరిగా అందటం లేదో లోతైన సమీక్ష అవసరమని జేపీ అన్నారు. రాష్ట్రంలో దాదాపు 70శాతం మంది స్కూలు పిల్లలకు సరిగా చదవటం, లెక్కలు చేయటం కూడా రాదన్నారు. ప్రపంచంలో మరే దేశంలోనైనా చదువు, ఆరోగ్యం ఈరీతిన ఉంటే.. మిగతా పనులన్నిటినీ పక్కనపడేసి ఈ రెంటి గురించే లోతైన చర్చ చేస్తారని, ఎన్నికల అంశాలుగా మారుస్తారని అన్నారు. విద్య అంటే తెలియని పాలకులు మనల్ని పరిపాలిస్తున్నారన్నారు.

**జిల్లాలో మాస్ కాపీయింగ్ జరుగుతోంది**

మార్కులు, ర్యాంకుల కోసం జిల్లాలో మాస్ కాపీయింగ్ జరుగుతోందని, ఇలా చదివి బైటికొచ్చిన విద్యార్థుల్లో ఎక్కువమంది ఉపాధి లేనివారిగా మిగిలిపోయే ప్రమాదముందని జేపీ హెచ్చరించారు.

**సీమలో ప్రాసెసింగ్ యూనిట్లు, స్టోరేజీలు ఏవీ?**
**స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు హామీ ఏమైంది?**

రాయలసీమలో ఎక్కడా ప్రాసెసింగ్ యూనిట్లు, స్టోరేజీలు కనిపించటంలేదని, వర్షపు నీటిని ఒడిసిపట్టటంతోపాటు వీటిని నిర్మిస్తేనే రైతులు మనుగడ సాగించగలుగుతారని జేపీ అన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనకబాటుతనం గురించి రాష్ట్ర విభజన సమయంలో గళం విప్పింది లోక్‌సత్తాయేనని గుర్తు చేశారు. రైతులు నష్టపోతున్నది ప్రకృతి శాపం వల్లకాదని.. పాలకుల పాపం వల్లనేనని పునరుద్ఘాటించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి సాగు వ్యయానికి అదనంగా 50శాతం కలిపి మద్దతు ధర ఇస్తామన్న హామీల ఊసు ఏమైందని ప్రశ్నించారు. లోక్‌సత్తా చెబుతున్నట్టు రైతుకు ఆదాయం చుట్టూ వ్యవసాయ విధానాల్ని రూపొందిస్తే.. కౌలురైతులు కూడా ఎంతో లాభపడతారన్నారు. భూ యజమాని అయినా, కౌలుదారయినా రైతు రైతేనన్నారు.



మనదేశంలో నాయకులు విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, చట్టబద్ధ పాలన, స్థానికంగా ప్రజలకు అధికారాలు, నిధులు వంటి మౌలికాంశా లను పక్కనపెట్టేసి చిట్టచివర కొద్దిమంది నిస్సహా యులకు చేయాల్సిన ఉచితాలను అందరికీ వర్తింపచేస్తూ పేదరికాన్ని నిరంతరం కొనసాగి స్తున్నారని జేపీ అన్నారు. ప్రజలకు స్వతంత్ర జీవనం లేకుండా, తలెత్తుకుని బతికే ఆత్మవిశ్వాసం లేకుండా చేస్తున్నా రన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యరంగాలను బలోపేతం చేయాలని, ప్రజలకు లంచాల్లేని సేవలను కార్యాలయాల్లో అందించాలని, పెద్ద అదనపు ఖర్చు లేకుండానే వీటన్నిటినీ చేసేయవచ్చని అన్నారు. స్థానిక ప్రభుత్వా లైన పంచాయతీలు, మునిసిపాలిటీలకు అధికారాలను, నిధులను బదిలీ చేయాలని, అక్కడ తప్పు జరిగితే కఠిన చర్యలకు రాష్ట్రప్రభుత్వమే జిల్లాకో అంబుడ్స్‌మన్‌ను ఏర్పాటు చేయవచ్చని అన్నారు.

ఇలా ఆచరణసాధ్యమైన, తెలికైన మార్పుల కోసమే యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్ ప్లాట్‌ఫారాలను ప్రారంభించామని, వీటిలో ఎన్‌రోల్ కావడం ద్వారా యువత, ఇతర వయసుల ప్రజలు సురాజ్యాన్ని సాధించుకోవచ్చని, తమ జీవితాల్ని మెరుగుపరచుకోవచ్చని జేపీ తెలిపారు.

బండారు రామ్మోహనరావు, మారంరెడ్డి శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, సయ్యద్ సలావుద్దీన్, వేణుగోపాల్, బాలాజీ, జమాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ★

# చారిత్రక విభాతసంధ్యల వైపు...

**- ఏబీకే ప్రసాద్,** సీనియర్ సంపాదకులు

**అపభ్రంశాల మూలంగా, కుల, మత వైరుధ్యాల ఫలితంగా తెలుగువారి చరిత్ర రచనకు కూడా న్యాయం జరిగి ఉంటుందని విశ్వసించలేం. చదువుకు మెట్రిక్యులేషన్ 'గ్రాడ్యుయేట్' అయిన మల్లంపల్లి సోమశేఖరశర్మ 'కాళ్లకు బలపాలు' కట్టుకుని 'తెలుగునాటి పూర్వ చరిత్ర కాణాచి యెల్ల తవ్వి తలకెత్తిన' మహనీయుడు. 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర'కు విస్తృతి కల్పించిన సురవరం ప్రతాపరెడ్డి తెలుగువారి చరిత్రకు సంస్కృతికి పనికివచ్చే అసలు సిసలు సాధనాలేవో ఆరు దశాబ్దాల నాడే చెప్పారు.**


**'భారతదేశ పురా చరిత్ర ఈనాటిది కాదు. అది క్రీస్తుపూర్వం 5000 నుంచి, క్రీస్తుశకం 500 ఏళ్ల దాకా అనలు తొడిగి కొనలు సాగి కొనసాగుతున్న చరిత్ర. ఆ మాటకొస్తే తెలుగువారి రెండు ప్రాంతాలు కలిపిన అవిభక్త ఆంధ్రప్రదేశ్ పురా చారిత్రక యావద్భారతావనికే రాజధాని'**

**– హెచ్.డి సంకాలియా (భారత పురావస్తు శాస్త్రజ్ఞుడు, చరిత్రకారుడు)**

**'ఈ చోట తొలినాడు ప్రాచీ సతి ముఖాబ్జమున/ ఎళ్లి కుంకుమబొట్టు దిద్ది/ ఈ పవిత్ర ధరిత్రనోపి త్రైలింగ రాజ్యశ్రీ సుధా ప్రవర్షంబు కురిసె/ ఇచ్చట మంటిగడ్డలు సైతమ్ము/ నవమృగీవాసనలు విదర్చె.....'**

**– విశ్వనాథ్**

**ఇం**తవరకూ విశ్వసిస్తున్నట్టు తెలుగువారి చరిత్ర క్రీస్తుపూర్వం 3000, ఆ పైచిలుకు బౌద్ధయుగానికే పరిమితం కాలేదు. తెలుగు (ఆంధ్ర) జాతికి అంతకుమించిన చరిత్రే ఉందని ఆచార్య సంకాలియా పేర్కొనడం విశేషం. తొలి మానవుడి ఆవిర్భావం ఆఫ్రికా ఖండం మీదే జరిగిందని భావిస్తున్న సమయమిది. ప్రాచ్య ఖండంలో అంతర్భాగమైన భారతదేశంలో ఈ మూలన ఉన్న తెలుగు తెగల భూమి ఆదిలాబాద్ ప్రాంతం (తెలంగాణ) తొలి మానవుడి జన్మస్థలిగా సంకాలియా భావించారు. చరిత్రలో తొలి మానవుడి జన్మస్థలం కడప జిల్లాయేనని మెకంజీ, మన్రో సిద్ధాంతీకరించారు.




రాజకీయులు రెండుగా చీల్చినందుకు తెలుగుజాతి ఆవేదనలో ఉన్నమాట నిజమే. అందుకే అలాంటి సంకుచిత విభేదాలులేని పురాతత్వ పరిశోధకుల, చరిత్రకారుల దృష్టి వైశాల్యం ఓ అద్భుత అంశంగానే దర్శనమిస్తుంది. సుప్రసిద్ధ చరిత్రకారుడు బుర్ఖార్డ్, ***'గతించిన యుగాల చరిత్ర వెలుగులోనే వర్తమాన చరిత్రను ఆవిష్కరించుకోగలం. గతించిన సమాజాల ప్రారంభ వికాసాలనూ, పతన దశలనూ అర్థం చేసుకొని మానవుడు వర్తమాన సమాజాన్ని తీర్చి దిద్దుకోగలుగుతాడు. ఇదే చరిత్ర కార్యాచరణ విధి'*** (జడ్జిమెంట్స్ ఆన్ హిస్టరీ అండ్ హిస్టోరియన్స్) అని వ్యాఖ్యానించడంలోని అంతరార్థం ఇదే కావచ్చు. ఇదే చరిత్రతత్వంతో, సంకాలియా, దామోదర ధర్మానంద కొశాంబి, మల్లంపల్లి, పరబ్రహ్మశాస్త్రి వంటి పరిశోధక శిఖామణులు చూపిన బాటలో వెలువడినవే 'ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర–సంస్కృతి'ని వివరించే తొమ్మిది సంపుటాలు. ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ ఆధ్వర్యంలో సుప్రసిద్ధ చరిత్ర అధ్యాపకులు, చరిత్రకారుల సహకారంతో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, ద్రవిడ విశ్వవిద్యాలయం సహకారంతో, ఎమెస్కో చేయూతతో ఈ బృహత్ సంపుటాలను తెలుగువారికి అందించారు. ప్రతి సంపుటానికి నిపుణుడైన ఒక చరిత్రకారుడు సంపాదక

బాధ్యతలు నెరపినప్పటికీ, మొత్తం సంపుటాల రచనలో ప్రధాన సంపాదకుని బాధ్యతనూ, రచనా సంఘం కృషిని సమన్వయం చేసే పనినీ ఆచార్య వకుళాభరణం రామకృష్ణ అవిశ్రాంతంగా నిర్వహించారు.

## ఇదొక చరిత్రాత్మక యజ్ఞం

తెలుగుజాతి వైభవోన్నతులకూ, విభిన్న పాలనా వ్యవస్థల కింద వారు అనుభవించిన కష్టసుఖాలకూ ఈ సంపుటాలన్నీ అద్దం పడతాయి. పురాతన ఆంధ్రప్రదేశ్ (క్రీ.పూ 500– క్రీ.శ 624) చరిత్ర సంస్కృతి నుంచి, మధ్యయుగాలు, అనంతర యుగాలలో తెలుగువారి సంస్కృతీ విశేషాలను, తదుపరికాలంలో ఆధునిక హైదరాబాద్, కంపెనీ పాలనలో తొలిదశలను విపులంగా ప్రస్తావించారు. ఇంకా, అత్యాధునిక చారిత్రక, సాంస్కృతిక దశలను కూడా వివేచనాత్మకంగా, అకుంఠిత దీక్షతో అందించారు. వేల ఏళ్ల తెలుగువారి చరిత్రను దాదాపు రెండు దశాబ్దాలపాటు, 200 మందికిపైగా నిష్ణాతులు, పండితులు, రచయితలు అందించిన రచనలతో ఈ సంపుటాలను సమున్నతంగా వెలువరించారు. కాగా, ఇందులో తొలి ఎనిమిది చరిత్ర, సంస్కృతులను విశ్లేషిస్తాయి. వీటన్నిటికి ప్రామాణికతను చేకూర్చే ఆధారాలు, రికార్డులు, పత్రాలు, పరామర్శ గ్రంథాలు వంటి సమాచారం అందించేదే చివరి 9వ గ్రంథం (క్రీ.పూ 5000– క్రీ.శ 2016).

దేశంలో లభిస్తున్న ఆధారాలే కాకుండా, తెలుగు చరిత్ర–సంస్కృతులకు సంబంధించి విదేశీయుల, పురావస్తు శాస్త్రవేత్తల పరిశీలనలలో లభిస్తున్న ప్రస్తావనలు కూడా చివరి సంపుటంలో పొందుపరిచారు. అంటే ఈ మహా చారిత్రక పరిశోధనకు, ఈ పరిశోధనను ఆవిష్కరించిన ఈ సంపుటాలకు మూలం రాతి పలకలలో, రాగి రేకులలో, నాణేలలో నిక్షిప్తమైన సమాచారమే. చరిత్రకు అందని కాలం నుంచి కొత్తగూడెంలో లభించిన కెంపుల వంటి ఎరుపురంగు రాళ్లను ఆభరణాలలో పొదిగి రెండువేల ఏళ్ల నాడే రోమ్, తదితర ప్రాంతాలకు ఎగుమతి చేసేవారని పరిశోధకులు కనుగొన్నారు. ఈ విషయాన్ని నవరత్నాల పరిశోధనలకు వాడే భూగర్భ శాస్త్రవేత్తల బృందం ఈ నెల 14న వెల్లడించింది. గరీబ్‌పేట రత్నాలను తమిళనాడులోని అరికమేడ వద్ద శుద్ధి చేసి ఎగుమతి చేసేవారనీ, ఈ పని క్రీ.శ 1–7 శతాబ్దాలలో సాగేదనీ పురావస్తు శాస్త్రవేత్తల అంచనా. అందుకే 'చరిత్ర అంటే ఏమిటి?' అన్న తన గ్రంథంలో, ***'చారిత్రక పత్రాలలో, శాసనాలలో, చెక్కిన శిలల్లో వాస్తవాలు లభ్యమవుతాయి– చేపలని వలేసి పట్టి అమ్మే జాలరి వలెనే చరిత్రకారుడికి కూడా చారిత్రక సత్యాలు దొరికిపోతాయి. కనుకనే చరిత్రకారుడు చేతికందిన శాసనాధారాలను, నాణేలను సేకరించుకుని ఇంటికి తీసుకుపోతాడు. అక్కడ వాటి ఆధారంగా చరిత్రను వండి వార్చి తనకు నచ్చిన పద్ధతిలో నలుగురికీ అందిస్తాడు'*** అని ఇంగ్లండ్‌కు చెందిన ఈహెచ్ కార్ అనే చరిత్రకారుడు అన్నారు.

## ఏది యదార్థం? ఏది కల్పన?

కానీ, పరిశోధనల ఫలితంగా వెలువడే వాస్తవాధారాలకూ, జనబాహుళ్యంలో ఉండే గాథలకూ అసలు సంబంధం లేకపోవడం కూడా కద్దు. అలాగే సాహిత్యాధారాలు కూడా. అందుకే వైరుధ్యాల జాబితా పెరిగి ఏది నిజమో, ఏది కల్పనో తెలుసుకోలేనంత అంతరం ఏర్పడిందని కొశాంబి అభిప్రాయపడవలసి వచ్చింది. రామాయణ, మహాభారతాలలోని తొల్లింటి శ్లోకాల సంఖ్యను పెంచేసిన 'మహానుభావుల' మూలంగా చరిత్రకూ, కల్పిత గాథలకూ మధ్య పొత్తూ పొంతనా లేకుండా పోయాయని, మహా యుద్ధాలుగా జరిగినవని చెప్పే ఘటనల స్థలకాలాలకు, జరిగిన వాస్తవాలకు సమన్వయం కుదరని కొన్ని ఉదాహరణలను డాక్టర్ కొశాంబి తన విశిష్ట గ్రంథం 'ఇండియన్ హిస్టరీ'లో (1956) పేర్కొన్నారు. గదా యుద్ధాల్లాంటి కథా యుద్ధాలతో ఏది కల్పితమో, ఏది కాదో నిర్ణయించలేని దుస్థితిలోకి పాఠకుల్ని నెట్టారు. విక్రమాదిత్యుడి పట్టాభిషేకం క్రీ.పూ 57 లోనా మరెప్పుడు జరిగిందో నిర్ధారించలేని తగాదా గురించిన శషభిషలు శతాబ్దాలు గడిచినా 'విక్రమ శకా'నికి సక్రమ రూపం రానేలేదు. కశ్మీర మహా పండితుడు కల్హణుడు చారిత్రక సత్యాలతో కూర్చిన 'రాజతరంగిణి' (సంస్కృత కావ్యం: 1149–50) సారాన్ని కూడా 'చెయ్యాడింపు'తో ఎవరో ద్వంద్వార్థాలతో కలగాపులగం చేసి, అసలు కల్హణుడు చెప్పదలచుకున్న వాస్తవాలకు కూడా మసిపూసి మారేడుకాయగా మార్చారని కొశాంబి విమర్శించారు. అలా, ముస్లిం పాలనాకాలం వచ్చేదాకా కల్హణుడు రాసిన పాతచరిత్రను కూడా కొందరు హిందూ పండితులు మిగల్చక పోయారని ఆయన ఆరోపణ.

ఇలాంటి అపభ్రంశాల మూలంగా, కుల, మత వైరుధ్యాల ఫలితంగా తెలుగువారి చరిత్ర రచనకు కూడా న్యాయం జరిగి ఉంటుందని విశ్వసించలేం. చదువుకు మెట్రిక్యులేషన్ 'గ్రాడ్యుయేట్' అయిన మల్లంపల్లి సోమశేఖరశర్మ 'కాళ్లకు బలపాలు' కట్టుకుని 'తెలుగునాటి పూర్వ చరిత్ర కాణాచి యెల్ల తవ్వి తలకెత్తిన' మహనీయుడు. 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర'కు

విస్తృతి కల్పించిన సురవరం ప్రతాపరెడ్డి తెలుగువారి చరిత్రకు సంస్కృతికి పనికి వచ్చే అసలు సిసలు సాధనాలేవో ఆరు దశాబ్దాలనాడే ఇలా చెప్పారు. *'రాజుల, రాజ్యాల చరిత్ర రాయడం అంత కష్టం కాదు. కానీ సాంఘిక చరిత్ర రాయడమే కష్టం. దీనికి దారాలు తక్కువ. తెనుగు సారస్వతం, శాసనాలు, స్థానిక చరిత్రలు (కైఫీయత్తులు), విదేశీయులు వచ్చి చూసి రాసిన చరిత్రలు, శిల్పాలు, చిత్తరువులు, నాణేలు, సామెతలు, దానపత్రాలు, సుద్దులు, పూర్వ వస్తు సంచయాలు- ఇవి చరిత్రకు పనికివచ్చే సాధనాలు'.*

ఈ దృక్పథానికి దగ్గరగా వచ్చే సమకాలీన చరిత్రకారుడైన డి.డి కొశాంబి సింధు నదీ లోయ నాగరికత 'విత్తన కేంద్రం' (సీడ్ న్యూక్లియస్) ఎలా భరత ఖండం దాటి సుమేరియాను సువర్ణ కలశంగా తీర్చిదిద్దిందో చెబుతూ కల్పిత గాథలకూ, వాస్తవ పరిణామాలకు మధ్య ఎంతగా పూడ్చలేని అఖాతం ఉంటుందో ఇలా వివరించాడు: *'మసిపూసి మారేడుకాయ చేసే కల్పితగాథలోని సారాన్ని పిండ చూడడం వృథా ప్రయాస, తద్వారా అందులోంచి చారిత్రక సమాచారాన్ని సరాసరి పొందడం అరుదైన ఘటన. ఫలితంగా భారత చారిత్రక మహనీయులు, మహాఘట్టాలూ కల్పితగాథా స్రవంతిలో దురదృష్టవశాత్తూ కనుమరుగైపోతారు. అలా కాలం గడచిన కొలదీ వాస్తవ దూరమైన ఈ కల్పిత గాథలే జనాల మధ్య నిజాలుగా చెలామణీలో ఉంటుంటాయి'.*

**వెలుగుదివ్వెలు**

నిజానికి పొరుగువాడి కల్పిత గాథలకు చెవియొగ్గి, తన జాతి చరిత్రకు, భాషకు చేటు తెచ్చుకుని, ఎదురొడ్డి నిలబడలేక 'ఇది మా భాష' కాదన్న కొందరు తెలుగువాళ్లు మద్రాసు హైకోర్టు దాకా ఎగబడి తెలుగు ప్రాచీన చరిత్రను, సంస్కృతినీ న్యూనతపరిచిన పొరుగువాడితో చేతులు కలిపిన పరిణామాన్ని 'గతమని' సరిపెట్టుకోవాలి. ఈ ఆంధ్రజాతికి అక్షరజ్ఞానమే తెలియదన్న వుండాకోరులకు గోదావరి నీళ్లను యావద్భారతమూ ఆబతో పుక్కిటపట్టి ఆనందించిన రోజులు పరగడుపైపోయాయి. శిల్పకళకు తొలి పూజలందించినాడు, విమల కృష్ణానదీ ఇసుక తిన్నెలలో కోకిలపు పాట పిచ్చుక గూళ్లు కట్టుకుని వెన్నెలరాత్రులలో నేర్చుకున్న తెలుగుజాతి అక్షరజ్ఞానమెరుగదన్న మాట పొరుగువాడి ఏడుపుపాట. వేల సంవత్సరాల భాషా సంస్కృతులతో తులతూగిన అలాంటి తెలుగు భాషీయుల సమగ్ర చారిత్రక, సాంస్కృతిక నేపథ్యాన్ని తెలుసుకోగోరే వారందరికీ అలాంటి అధ్యయన అవకాశాన్ని ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ కల్పిస్తోంది. పండిత రాళ్లపల్లి అన్నట్లు, ***"తెలిసికొన మాకు బతుకులో తీరకేది? మరిచిపోయిన జ్ఞాపించు మార్గమేది?"*** అని వాపోయేవారికి తీరికను, మార్గాన్ని చూపించే తెలుగు వెలుగు దివ్వెలే ఈ సంపుటాలు!

(సాక్షి సౌజన్యంతో) ★

# వినియోగదారుల సంక్షేమనిధిని ఏర్పాటు చేయాలి




వినియోగదారుల సంక్షేమనిధికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయింపులు చేయాలని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు, విజయనగరం జిల్లా పౌరవేదిక సారథి భీశెట్టి బాబ్జీ అన్నారు. పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, విజయనగరం, బండపల్లి వినియోగదారుల మండలి అధ్యక్షులతో విజయనగరంలో జరిగిన సమావేశానికి ఆయన సారథ్యం వహించారు. రాష్ట్ర వినియోగదారుల పరిరక్షణ కమిటీ సభ్యునిగా కూడా బాబ్జీ సేవలందించారు. వినియోదారులకు జరుగుతున్న మోసాలు బైటికి తెలుస్తున్నంత తక్కువేమీ కాదని, వీటి నుంచి ప్రజల్ని పరిరక్షించేందుకు పటిష్ట చర్యలు అవసరమని ఆయన అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సానుకూలంగా ఉపయోగించుకోవటాన్ని పెంపొందించుకునేలా ప్రజల్ని చైతన్య పరచాలన్నారు.

వినియోగదారుల జిల్లా నూతన సమాఖ్యను ఈ సందర్భంగా ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడు: భీశెట్టి బాబ్జీ, అధ్యక్షుడు: టీఎస్ఎన్ మూర్తి, ఉపాధ్యక్షులు: టి.నాగమణి, ఎం.నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి: జిల్లెల సీతారాం, సహాయ కార్యదర్శి: కేవీ శంకరరావు, కోశాధికారి: ఎం.రామకృష్ణ, కమిటీ సభ్యులు: గున్నయ్య గుప్తా, బలగ రాధ, సువ్వాడ రమణ, జి.గుప్తేశ్వరరావు, టి. ధనుంజయరావు, దాసరి సురేష్, టి.చినముత్యాలు, కె.సన్యాసిరాజు, గొర్లె ధనుంజయరావు, రవ్వల ఊర్మిళ, విక్రమ్, సుదర్శనరావు, గిడుతూరి పైడితల్లి. ఎన్నికైన నూతన కార్యవర్గం త్వరలో జిల్లా కలెక్టర్, ఇతర యంత్రాంగాన్ని కలిసి కార్యాచరణను ప్రారంభిస్తుందని తెలిపారు. ★

# (మీడియాలో) 'కీ' కామెంట్లు!

■ ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ పేరుతో వకుళాభరణం రామకృష్ణ సంపాదకత్వంలో వెలువడిన గ్రంథంపై ద్యావనపల్లి సత్యనారాయణ సమీక్షా వ్యాసంలో కొన్ని కీలకమైన అంశాలను లేవనెత్తాడు. ఈ గ్రంథంలో తెలంగాణ చరిత్ర, సంస్కృతి, రచయితలు ఏ విధమైన విస్మరణకు గురైందీ సోదాహరణంగా వివరించాడు. సంపాదకుడు తెలంగాణ రచయితలు రాసిన గ్రంథాలను తెలుసుకునే ప్రయత్నం చేయలేదనేది నిర్వివాదాంశం. ఉదాహరణకు రామకృష్ణ స్వయంగా రాసిన 'సాహిత్య ఆధారాలు' అధ్యాయంలో తెలంగాణ సాహిత్య చరిత్ర రాసిన అనేకమంది ప్రముఖ రచయితలను పేర్కొనలేదు. గడియారం రామకృష్ణశర్మ, ఆదిరాజు వీరభద్రరావు, బిరుదురాజు రామరాజు, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్, జూలూరి గౌరీశంకర్, కె.శ్రీనివాస్ తదితరుల రచనలను ఈ చాప్టర్ గ్రంథ సూచికలో ప్రస్తావించలేదు. అదేవిధంగా 'జానపద కళలు–సంస్కృతి' అధ్యాయంలో జయధీర్ తిరుమలరావు, ఎం.భాగ్యమ్మ, చింతల యాదయ్య, రక్నుద్దీన్, కసిరెడ్డి వెంకటరెడ్డి, అంజమ్మ లాంటి తెలంగాణ రచయితల గ్రంథాలను ప్రస్తావించలేదు. ఆధునిక, సమకాలీన తెలంగాణ చరిత్రకు సంబంధించి ఈ గ్రంథంలో పేర్కొన్న అంశాలు అసమగ్రంగా ఉన్నాయి. అధ్యాయాల్లో తెలంగాణ చరిత్ర, సంస్కృతికి సంబంధించిన ఆధారాల ప్రస్తావన ఆశాజనకంగా లేదు. సంపాదకుడు టైటిల్ పేజీలో క్రీ.పూ 5000– నుంచి క్రీ.శ 2016 వరకు ఆధారాల గురించి ప్రస్తావించినాడు. కానీ గ్రంథం లోపల చాప్టర్లలో 2016 వరకు ప్రచురించిన గ్రంథాల ప్రస్తావన లేదు. ఈ గ్రంథ రచయితల్లో చాలామంది సీనియర్స్ ఉన్నప్పటికీ, ఆధారాలు గుర్తించి అప్‌డేట్ చేయలేదు.

–అడపా సత్యనారాయణ

*■ మనదేశంలోని పలు రాష్ట్రాలను చూస్తే మీకు అర్థమవుతుంది. సాయంత్రమైతే అమ్మాయిలు ధైర్యంగా బయటకు రాలేరు. అలాంటివాళ్లు బయటికొచ్చేలా చూడగలిగితే.. వాళ్లు ఆర్థికంగా స్వాతంత్ర్యం సాధిస్తే దేశ భవిష్యత్తు అద్భుతంగా ఉంటుంది. స్త్రీలకు పూర్తి స్వేచ్ఛ రావడమే.. భారత్‌లో రావాల్సిన చివరి విప్లవమవుతుంది.*

*– మేనకా గురుస్వామి, న్యాయవాది , పలు దేశాల రాజ్యాంగ రచనా కమిటీల్లో సభ్యురాలు*

■ కులగోత్రాల చుట్టూ, వ్యక్తుల చుట్టూ పరిభ్రమించే ధోరణికి బదులు వ్యవస్థలపై ఎక్కుపెట్టే పోరాటాలే ఎప్పటికైనా తీరం చేరుస్తాయి.

- తెలకపల్లి రవి, సీనియర్ జర్నలిస్టు

*■ మలేషియా నుంచి సింగపూర్ విడిపోయింది. వనరులన్నీ మలేషియాలో ఉండేవి కానీ, ఈనాడు ప్రపంచంలో అమెరికాతో సమానంగా సింగపూర్ జీడీపీ ఉంది. అదేమాదిరిగా ఉత్తర కొరియాలో వనరులన్నీ ఉన్నాయి. కానీ కొరియా విడిపోయాక దక్షిణ కొరియా అభివృద్ధి చెందింది. స్వీడన్ ఒకనాడు ప్రపంచానికి గడియారాలిచ్చింది. కానీ, ఫిన్లాండ్ ప్రపంచంలో ఇంకా పేరుప్రతిష్టలు తెచ్చుకున్నది. వనరులు లేవని నిరుత్సాహ పడలేదు. స్వీడన్‌తో ఫిన్లాండ్ పోటీపడలా. ఇది పోటీల కాలం కాదని, ఇది సహకార యుగమని ఫిన్లాండ్ విద్యాశాఖామంత్రి స్వీడన్‌కు వెళ్లి అక్కడి విద్యారంగాన్ని పరిశీలించారు. అందరికీ విద్య, విద్యావకాశాలను సమకూర్చటమే స్వీడన్ అభివృద్ధి రహస్యమని కనుక్కున్నారు. కానీ, విద్యా ప్రమాణాలు పెరగటానికి స్వీడన్‌లో అధిక గంటలు పనిచేసేవారు. పిల్లలకు ఎక్కువగా పరీక్షలు నిర్వహించేవారు. హోంవర్క్‌లు ఎక్కువగా ఇచ్చేవారు.*

*అయితే, ఫిన్లాండ్ దేశం మాత్రం స్వీడన్‌లోని మంచి సంస్కరణలను తీసుకున్నది. పిల్లలపై భారం మాత్రం వేయలేదు. కొత్త ప్రక్రియను అవలంబించారు. వయోజన విద్యపైన ఎక్కువ దృష్టిని కేంద్రీకరించారు. పెద్దలు చదివితే చిన్నపిల్లలపై ఆ ప్రభావం పడి రెట్టింపు శ్రద్ధతో చదువుతారని వయోజన విద్యను పటిష్టంగా అమలు జరిపారు. దాని వలన ఉన్నత ప్రమాణాలు గల టీచర్లు దొరికారు. ఈనాడు అన్ని*

*వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తి పట్ల ప్రజలు ఎక్కువగా ఆకర్షితులు కావడం అక్కడ కనిపిస్తున్నది. ఫిన్లాండ్‌లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టడం తమ దేశభక్తికి నిదర్శనమనుకుంటారు. జీతాలు పెంచటం వల్ల వారు ఉపాధ్యాయవృత్తిలోకి రాలేదు. నేను ఫిన్లాండ్ వెళ్లినప్పుడు అక్కడివారు ఎందుకు ఉపాధ్యాయ వృత్తి స్వీకరించారో అడిగి తెలుసుకున్నాను. "దేశాభివృద్ధిలో వచ్చేతరం విద్యార్థులదే కీలకపాత్ర. కాబట్టి విద్యారంగం చేసే పని భవిష్యత్తు నిర్మాణానికి మెట్టు అవుతుంది" అన్నారు. విద్యాప్రమాణాలు పెరగడానికి అక్కడ ఎంతో కృషి జరిగింది. పెద్దలు చూపిస్తున్న శ్రద్ధ చిన్న పిల్లలకు స్ఫూర్తిని ఇస్తుంది. కొన్ని సంవత్సరాలకే ఉన్నతమైన ప్రమాణాలను తీసుకువచ్చి ఫిన్లాండ్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరచింది. 10 సంవత్సరాల ఎస్ఎస్‌సీ కోర్సును 9 సంవత్సరాలలో పూర్తిచేశారు. కానీ ప్రమాణాలలో మాత్రం రాజీ లేదు. దీనివల్ల ఈనాడు ఫిన్లాండ్ ప్రపంచానికే ఆదర్శమైంది. దక్షిణ కొరియా, సింగపూర్ దేశాలు ఫిన్లాండ్ పద్ధతులను అవలంబించి విద్యారంగంలో ఉన్నతమైన ప్రమాణాలు సాధించుకున్నాయి. అక్కడ ఉపాధ్యాయులు, స్కూళ్ల మధ్య పోటీ లేదు. ఒక స్కూలు ఇంకో స్కూలుకు సహకరిస్తుంది. తక్కువ ప్రమాణం గల స్కూళ్లను ప్రమాణాలను సాధించిన ఇతర స్కూళ్లతో సమంగా చేయడమనేది అక్కడ బాధ్యతగా భావిస్తారు. ఈనాడు మన విద్యను ఆర్థికరంగానికి శక్తిని ప్రసాదించే స్థాయికి తీసుకురావాల్సి ఉంది. రాష్ట్ర ఆర్థికవ్యవస్థకు స్కూళ్లు ఊపిరులు ఇస్తాయి.*

*- చుక్కా రామయ్య, విద్యావేత్త*

■ *'ఎస్' యాష్ పేరిట ప్రత్యేక అల్గారిథమ్‌లను రాసి యంత్రాలకు ప్రోగ్రామింగ్ చేసి.. యంత్రాలు-యంత్రాలు, యంత్రాలు-మనుషులు, మనుషులు-మనుషులు మధ్య సంబంధాలను పరీక్షించాం. ఇద్దరి మధ్య ఆమోదయోగ్య ఒప్పందాలను కుదర్చడంలో ఈ కృత్రిమ మేధ యంత్రాలే మెరుగ్గా పనిచేస్తున్నట్టు గుర్తించాం. సగం మంది మనుషులు ఏదో సమయంలో అబద్ధాలు చెబుతుంటారు. అబద్ధాలు మాట్లాడకూడదనే అంశంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తూ ఈ అల్గారిథమ్‌లు రాశాం. నిజాయతీగా ఉండే మనుషులు ఈ యంత్రాల్లాగే చక్కగా ఆమోదయోగ్య పరిష్కారాలను కుదర్చగలరు.*

*- జాకబ్ క్రాడెల్, కృత్రిమ మేధస్సు రంగంలో పరిశోధకులు*

■ విభజన సమయంలో ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌కి రూ.**97**వేల కోట్ల అప్పు ఉంటే, గతేడాది అక్టోబర్‌నాటికి అది రూ.**2.16**లక్షల కోట్లకు పెరిగింది. ఇంత పెద్ద మొత్తంలో అప్పులు తెచ్చినా ఒక్క శాశ్వత ఆస్తినీ ఏర్పాటు చేయలేదు. ఈ డబ్బంతా ఎక్కడకు పోయింది? రోజువారీ ఖర్చులు, హోటళ్లు, ట్రావెల్ బిల్లులు, విమాన ఛార్జీలకే వందల కోట్లు వెచ్చించారు. విశాఖలో ఒక హోటల్‌కు చెల్లించిన బిల్లులతో రెండు మూడు కొత్త హోటళ్లను ఏర్పాటు చేసి ఉండవచ్చు. జీవో **22**ను తీసుకురావడం ద్వారా సాగునీటి ప్రాజెక్టుల అంచనాలను పెంచివేసి రూ.వేల కోట్లు కాంట్రాక్టర్లకు అదనంగా చెల్లించారు. పట్టిసీమను రూ.**1170**కోట్లకు అంచనావేసి **22**శాతం ధర పెంచి ఎలా ఇచ్చారు? ఈ తాత్కాలిక ఎత్తిపోతల పథకానికి ఏటా రూ.**100**కోట్ల విద్యుత్‌ను ఖర్చు చేస్తున్నారు. కాగ్ అభ్యంతరాలపైనే సమీక్షించాంతప్ప మేమేమీ ఆరోపణలు చేయటం లేదు.

**- అసెంబ్లీ ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ)**

■ *ఉపాధి అవకాశాల పెంపు మీదకన్నా వేతనాల పెంపు మీద దృష్టి పెట్టటం.. తక్కువ నైపుణ్యాల ఉద్యోగాలను యాంత్రీకరించే ప్రక్రియను మరింత వేగవంతం చేయవచ్చు.*

*- ప్రొఫెసర్ విద్య మహంబరే, ఆర్థిక విభాగం*

*(కర్టెసీ: ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ, ది హిందూ, సోషల్ మీడియా)* ★

# కులం కన్నా.. మన ప్రయోజనాలు ముఖ్యం కావాలి!

గతంలో కులం చుట్టూ ఓట్లు అడగాలని ఎవరైనా చూస్తే.. లేకి మనిషిగా భావించేవారని, ఇప్పుడు నిస్సిగ్గుగా స్వార్థప్రయోజనాల కోసం కులాన్ని వాడుకుంటున్నారని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, యూత్ ఫర్ బెటర్ ఇండియా (వైబీఐ) ఫౌండర్, మెంటార్ డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. కులవ్యవస్థ వల్ల ఏర్పడిన కుళ్లును నిర్మూలించటానికి కాకుండా, కులాన్ని ఘనీభవింప చేయటానికి విధానాల్ని అమలు చేస్తున్నారన్నారు. ప్రతి కులానికి కిందన ఒక కులం, అట్టడుగు కులంలోవారికి కూడా భార్య మీద పెత్తనం చేసే అవకాశం.. ఇలా తమక్కూడా ఏదో ఆధిపత్యం ఉందని భ్రమపడుతూ అత్యధికులు సర్దుకుపోయేలా కులవ్యవస్థను నిర్మించారని, సామాజిక, ఆర్థిక అంతరాలను తొలగించే నిర్దిష్ట చర్యలతో కులాన్ని నిర్మూలించాలన్నారు. అందుకు కులాంతర వివాహాలు వంటి పలు మార్గాలున్నా.. ప్రజాస్వామ్య రాజకీయం, పాలన ద్వారా తన జీవితాన్ని బాగు చేసుకోవటమెట్లాగో అణగారినవర్గాలవారు, పేదలు గుర్తించి వ్యవహరించటం అన్నిటికంటే ఎక్కువ ప్రభావం చూపుతుందన్నారు. అందుకే ప్రజాస్వామ్య సంస్కరణల మీద దృష్టి పెట్టి లోక్‌సత్తా పనిచేస్తోందన్నారు. వివక్షను తొలగించి అందరికీ ఎదిగే అవకాశాలనివ్వటానికి చట్టబద్ధపాలనను అమలు చేయటం, నాణ్యమైన విద్యను ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తేవటం ప్రధానమన్నారు.

కాకినాడలోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో మాచిరాజు అధ్యక్షతన జరిగిన యూత్ ఫర్ బెటర్ ఇండియా సమావేశంలో జేపీ ముఖ్య అతిథిగా పాల్గన్నారు. యువతను మమేకం చేసిన ఈ కార్యక్రమంలో.. యువతీయువకులు అడిగిన పలు ప్రశ్నలకు జేపీ జవాబులిచ్చారు.

నేటి యువత చాలా సందర్భాల్లో కులానికి ప్రాధాన్యం ఇవ్వకపోవటం దేశ భవితకు బంగారుబాట పరిచే ఓ మార్గమని జేపీ అన్నారు. అయితే చుట్టూ ఉన్న రాజకీయాల్ని, పాలనను పట్టించుకోకపోతే ఏదోకరూపంలో కులం ఊబిలోనే కొనసాగుతుంటారన్నారు. గ్రామీణ భారతాన్ని తమ రాజకీయ ప్రయోజనాల కోసం నాయకులు నిస్సత్తువతో నింపేస్తున్నారని, పలు పథకాల పేరుతో ఉచితాల్ని అనుచితంగా విస్తరించటంతో పాటు.. గ్రామాల ప్రజలకు దక్కాల్సిన అభివృద్ధి నిధులు అందకుండా చేస్తున్నారన్నారు. గ్రామీణుల్ని అమాయకుల్ని చేస్తూ ఆడుతున్న వికృత క్రీడలో అవగాహనారాహిత్యంతో ప్రజలు పావులుగా మారుతున్నారన్నారు. గ్రామ సంపద నగరాలకు తరలిపోవటంలో స్వార్థ రాజకీయనాయకులదే కీలకపాత్ర అన్నారు. ప్రజల కనీస అవసరాలు తీర్చకుండా, కులాల పేరుతో భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసే అవ్యవస్థలు పుంజుకుంటే.. ఇంటికో ఉద్యమకారుడు పుట్టుకొస్తాడన్నారు. తీవ్రస్థాయిలో రగిలిన



అసంతృప్తే నక్సలిజం వంటి భావనలు పురుడు పోసుకోవడానికి ప్రధాన కారణమన్నారు.

ప్రభుత్వ ఉన్నతోద్యోగి, ఆర్థికంగా స్థితిమంతుడైన రాజకీయ నాయకుడు ఆయా కులాల్లో అప్పటికే ఉన్న రిజర్వేషన్లను అనుభవించి ఉంటాడని, అతడి పిల్లలకు తిరిగి ఆ రిజర్వేషన్లను వర్తింపజేయడం అదే అణగారిన కులానికి చెందినవారి భవితను చిదిమివేయటమేనని.. అమెరికా నుంచి నగరానికి వచ్చిన డాక్టర్ మానసా మహతి అడిగిన ఓ ప్రశ్నకు జవాబుగా జేపీ చెప్పారు. అమెరికాతోపాటు ఇతర దేశాల్లో చదివి, ఉద్యోగాలు చేసిన తనకు ఏ సందర్భంలోనూ కులప్రస్తావన ఎదురుకాలేదని, కానీ స్వదేశమైన భారత్‌లో ఉన్నత స్థితిలో ఉన్నవారు కూడా తన కులం గురించి ప్రశ్నించటం బాధ కలిగించిందని ఆమె అన్నారు. హైదరాబాద్‌లో రోడ్డు మీద వెకిలి చేష్టలు చేసే పురుషుల వ్యవహారం తనను ఎంతో వేదనకు గురిచేసిందని, నేరుగా జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశానని తెలిపారు. ఆ తర్వాత కొన్నిరోజుల్లోనే షీ టీంలు ఏర్పాటయ్యాయన్నారు. వాటితో సమస్య పరిష్కారం కాకపోయినా, మానసిక భరోసా ఏర్పడిందన్నారు. ఓ ఎన్నారైగా వేరే దేశం నుంచి వచ్చిన తాను సమస్యను సంబంధిత అధికారులకు విన్నవించగలిగినప్పుడు.. స్థానికులైన మహిళలు, యువతులు ఎందుకు తాము ఎదుర్కొంటున్న అన్యాయాలపై ప్రశ్నించలేకపోతున్నారన్నారు. మానసిక ఆత్మస్థైర్యాన్ని మహిళలు అందిపుచ్చుకోవాలని జేపీ సూచించారు.

బ్యాంకుల జాతీయీకరణ సామాజిక తప్పిదంగా పేర్కొన్న జేపీ.. జన్‌ధన్ యోజన సానుకూల పథకమని అన్నారు. ఓటు హక్కును అమ్ముకున్న ప్రతి వ్యక్తీ తన వ్యక్తిత్వాన్ని అమ్ముకున్నట్టేనని వ్యాఖ్యానించారు. వివక్ష లేకుండా అందరికీ అవకాశాలనిచ్చే సమాజ నిర్మాణం కోసం సరైన అవగాహన ఉన్న కొత్తతరం నాయకత్వాన్ని తయారుచేసేందుకే.. 'యూత్ ఫర్ బెటర్ ఇండియా'కు రూపకల్పన చేశామన్నారు. ఎవరైనా ఇందులో ఎన్‌రోల్ అయి, తమ జీవితాల్ని చూసుకుంటూనే కొంత సమయాన్ని సమాజం కోసం కేటాయించవచ్చన్నారు. సమావేశంలో వైబీఐ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు, ఉపాధ్యాయులు, రచయితలు, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు. ★

పోటీ పరీక్ష ఏదైనా... రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు

THE NARAYANA GROUP

# నారాయణ తిరుపతి డివిజన్‌కే సొంతం

## అత్యద్భుతం.. అపురూపం.. అనిర్వచనీయం...

**EAMCET & MAIN ఫలితాలలో తిరుపతి నారాయణ విద్యార్థుల విజయభేరి...**

రాష్ట్ర స్థాయిలో రాయలసీమ ప్రాంతంలో మరియు తిరుపతి పట్టణంలో IIT ఇంజనీరింగ్, మెడికల్ ( NEET ) ఫలితాలలోఅత్యుత్తమ ర్యాంకుల పంట నారాయణ విద్యార్థులదే. ఉన్నత స్థాయి అధ్యాపక బృందం, పటిష్టమైన విద్యా ప్రణాళిక, ప్రతి విద్యార్థికి న్యాయం చేయాలనే దీక్ష నారాయణ సొంతం. విద్యార్థుల కఠోర పరిశ్రమకు తోడు, అధ్యాపకుల కృషి ఫలితమే ఈ విజయం.

నాడు మార్కులైన.... నేడు గ్రేడులైన .... సంచలన విజయాలు ఒక్క నారాయణకే సాధ్యం

## IPE – 2018 RESULTS

**JR MPC**

| RANGE | STRN |
|---|---|
| 10 GPA | 242 |
| ABOVE 9.8 | 417 |
| ABOVE 9.7 | 571 |
| ABOVE 9.5 | 688 |
| ABOVE 9.0 | 987 |

**JR BIPC**

| RANGE | STRN |
|---|---|
| 10 GPA | 30 |
| ABOVE 9.8 | 48 |
| ABOVE 9.7 | 58 |
| ABOVE 9.5 | 71 |
| ABOVE 9.0 | 110 |

**SR MPC**

TOP MARK 988

| RANGE | STRN |
|---|---|
| ABOVE 980 | 59 |
| ABOVE 970 | 192 |
| ABOVE 960 | 331 |
| ABOVE 950 | 458 |
| ABOVE 940 | 604 |
| ABOVE 900 | 1047 |

**SR BPC**

TOP MARK 988

| RANGE | STRN |
|---|---|
| ABOVE 980 | 4 |
| ABOVE 970 | 23 |
| ABOVE 960 | 38 |
| ABOVE 950 | 43 |
| ABOVE 940 | 53 |
| ABOVE 900 | 93 |

**SSC 2018 RESULT**

| RANGE | STRN |
|---|---|
| 10 GPA | 244 |
| ABOVE 9.8 | 429 |
| ABOVE 9.7 | 596 |
| ABOVE 9.5 | 777 |

## EAMCET & JEE-MIAN 2018 RESULTS

BEST STATE RANK IN AP EAMCET - 155
BEST RANK IN JEE-MAIN IN ALL INDIA - 161*

NO. OF STUDENTS BELOW 1000 RANK IN AP EAMCET- 9
NO. OF STUDENTS QUALIFIED IN JEE-MAIN - 270

**JEE-MAIN TOP RANKERS**



M. CHANDU HT–11614675 RANK-161
P.S. SAINATH HT–11603307 RANK-192
P. SAI DHARANI HT–11615065 RANK-431
K. ASHRAF HT–11612238 RANK-650
P. GURUNADH HT–11608094 RANK-789
H. MADHAN HT–11607980 RANK-2566
E.S. YASHWIN HT–11604360 RANK-11333
S.V.L ROSHINI HT–11603652 RANK-12255
R.MALLIKARJUNA HT–11601596 RANK-15297
N. NEHA HT–11615351 RANK-17243
M. JASWANTH HT–11614669 RANK-18419
M. RAJA SEKHAR HT–11612541 RANK-19932

**AP EAMCET TOP RANKERS**




KAASYAP SRIRAM HT–5816322724 RANK-155
G.LAKSHMI KIRANMAYI HT–582632258 RANK-261
K. SAI HARISH HT–5816324497 RANK-419
P.S. SAINATH HT–9836323149 RANK-461
V. PRASANNA LAKSHMI HT–5826322912 RANK-508
E.S. YASHWIN HT–9846322187 RANK-606
P. GURUNADH HT–9846321153 RANK-705
H. MADHAN HT–9846324103 RANK-724
S.V.L ROSHINI HT–9826322643 RANK-964

**MPC**

N120

JEE అడ్వాన్స్‌డ్‌లో 100 లోపు టాప్ ర్యాంకులే లక్ష్యంగా రూపుదిద్దిన సంచలనాత్మక ప్రోగ్రామ్




**BIPC**

N40

NEET మెడికల్‌లో 100 లోపు టాప్ ర్యాంకులే లక్ష్యంగా నారాయణ ప్రతిష్టాత్మకంగా రూపొందించిన ప్రోగ్రామ్

CONTACT : IIT COLLEGE - 8179880574, 0877-2284840, MEDICAL ACADEMY – 7337337069, 0877-2284811 - TIRUPATI




# చట్టబద్ధపాలన పట్ల నమ్మకం పెంచుతున్న పంజాగుట్ట పీఎస్

దేశంలోనే 2వ అత్యుత్తమ పోలీస్ స్టేషన్‌గా పురస్కారాన్ని పొందిన హైదరాబాద్‌లోని పంజాగుట్ట ఠాణాను ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) యువ పరిశోధనా బృందం ఇటీవల సందర్శించింది. పోలీసులు సహా ప్రభుత్వోద్యోగులంతా ప్రజాసేవకులే అన్న భావన అక్కడి సిబ్బందిలో కనిపించటం, మంచి సంప్రదాయాలను వ్యవస్థీకృతం చేయటం ఎఫ్‌డీఆర్ టీమ్‌ను ఆకట్టుకుంది. రోజువారీ సేవల్లో పంజాగుట్ట పీఎస్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తుండటంతోపాటు... పోలీసింగ్‌లో కమ్యూనిటీ భాగస్వామ్యం తీసుకుంటోంది. మహిళలకు హెల్ప్‌డెస్కుల ఏర్పాటు, వారు వేచివుండటానికి ప్రత్యేక గదులు, ఒత్తిడి తగ్గించడానికి జిమ్, మెడిటేషన్ కేంద్రం, గ్రంథాలయం, రూఫ్ గార్డెన్ వంటి ఏర్పాట్లు... బాధ్యతల నిర్వహణలో సిబ్బంది సానుకూల దృక్పథానికి అద్దం పడుతున్నాయి. ప్రభుత్వాల మొట్టమొదటి బాధ్యత, పేదలు, అణగారినవర్గాలు, మహిళల అభివృద్ధికి ఎంతో కీలకంగా ఉపయోగపడేదీ.... చట్టబద్ధపాలన! ఈ రూల్ ఆఫ్ లా అమలులో పోలీసులు ఎంత సన్నద్ధంగా ఉండాలో తెలియజెప్పే నమూనా పంజాగుట్ట పీఎస్‌లో కన్పిస్తుంది. హౌస్ ఆఫీసర్ రవీందర్ కృషిని అభినందిస్తూ, మరిన్ని పురస్కారాలను ఈ ఠాణా గెలుచుకోవాలని, తెలంగాణా, ఏపీ సహా దేశవ్యాప్తంగా పోలీస్‌స్టేషన్లు పంజాగుట్ట స్టేషన్ నుంచి నేర్చుకోవాలని ఎఫ్‌డీఆర్ బృందం ఆకాంక్షిస్తోంది.

Posting Date 07-06-2018
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on June 1st, 2018

# మహిళల భద్రత కోసం తక్షణం 'స్థానిక కోర్టుల్ని' ఏర్పాటు చేయాలి




'షీ టీమ్' లను ఏర్పాటు చేసినా, చట్టాలను కఠినతరం చేసినా తెలుగు రాష్ట్రాల్లో మహిళలు, బాలికలపై అత్యాచారాలు ఆగడం లేదు. చాలా సందర్భాల్లో దోషులకు శిక్షలు కూడా పడకపోవటంతో నేరస్తులు ఇంకా రెచ్చిపోతున్నారు.

మహిళలపై వేధింపుల దశలోనే వేగంగా కేసుల్ని విచారించి, కొద్దిరోజుల వ్యవధిలోనే చిన్న శిక్షలతో చర్యలు తీసుకునే ఏర్పాటు ఉంటే... అత్యాచారాల దాకా తెగించే ధోరణులు గణనీయంగా తగ్గుతాయి. తోటకూర దొంగతనంనాడే బుద్ధి చెప్పినట్లవుతుంది. ఇందుకోసం 'స్థానిక కోర్టుల్ని' ఏర్పాటు చేయటం అవసరం.

మహిళల భద్రతకు ఎంతో ఉపయోగపడే 'స్థానిక కోర్టుల్ని' ఏర్పాటు చేయటానికి అవసరమైన 'గ్రామన్యాయాలయాల' చట్టాన్ని 2008-09 లోనే లోక్‌సత్తా సాధించింది.

గ్రామన్యాయాలయాల చట్టం ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో వెంటనే స్థానిక కోర్టుల్ని ఏర్పాటు చేయాలి.

దేశవ్యాప్తంగా 5,000 స్థానిక కోర్టుల్ని ఏర్పాటు చేస్తే... భారత్‌లో కూడా అత్యాచారాల నిరోధానికి ఓ పటిష్ఠ మార్గం ఏర్పడుతుంది. ఈ కోర్టుల ద్వారా ఇతరత్రా చిన్న చిన్న కేసుల్లో కూడా తీర్పులు వెంటనే వెలువడుతూ సామాన్య ప్రజలకు తేలిగ్గా, చవగ్గా న్యాయం అందుబాటులోకి వస్తుంది. స్థానిక కోర్టులు - ఇతర కొన్ని సంస్కరణలతో చట్టబద్ధపాలన బలోపేతమై మహిళలు, బాలికల భద్రతకు భరోసా ఏర్పడుతుంది.

(Please support LOCAL COURTS and share this message widely.
For details: http://www.fdrindia.org/judicial-reforms/)

| | |
|---|---|
| Book-Post<br>PRINTED MATTER | To |
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad